సాక్షి
మహబూబ్‌నగర్

ఆదివారం । 9 । ఏప్రిల్ । 2023



తుది దశలో ఆర్‌ఓబీ
దేవరకద్రలో నెమ్మదిగా సాగుతున్న ఆర్‌ఓబీ పనులు తుది దశకు చేరుకున్నాయి.

వివరాలు 8లో ▸



ముగిసిన బావాజీ జాతర
తిమ్మారెడ్డిపల్లిలో బావాజీ ఉత్సవాలు శనివారం ముగిశాయి.

వివరాలు 10లో ▸

వాతావరణం
గరిష్ఠం/కనిష్ఠం
38.1 /24.2

ఆకాశం నిర్మలంగా ఉంది. కానీ అప్పుడప్పుడూ మేఘావృతమవుతుంది. మధ్యాహ్నం వేడిగా ఉంటుంది.




సంగమేశ్వర ఆలయం

సండే స్పెషల్

దక్షిణ గయ @ సంగమేశ్వరం

- పర్యాటకులను విశేషంగా ఆకట్టుకుంటున్న సంగమేశ్వర ఆలయం
- 6వ శతాబ్దం నాటి ఐహోలు, పట్టడికల్ నిర్మాణ శైలి
- శ్రీశైలంలో ముంపునకు గురికాకుండా రక్షిత కట్టడం
- 1990లో ఆలయ పునర్నిర్మాణం పూర్తి



గర్భాలయంలో కొలువుదీరిన సంగమేశ్వరుడు

జోగుళాంబ శక్తిపీఠం: పర్యాటక కేంద్రంగా పేరుగాంచిన అలంపూర్ పుణ్యక్షేత్రాలకు వచ్చే భక్త యాత్రికులను కూడవెల్లి సంగమేశ్వర ఆలయం ఆకట్టుకుంటోంది. సువిశాలమైన ప్రాంతంలో.. ఆహ్లాదభరితమైన వాతావరణంలో వెలసిన ఈ క్షేత్రం పర్యాటకులను మంత్రముగ్ధులను చేస్తోంది. అలంపూర్ ప్రాంతంలో ఉత్తర ఈశాన్య భాగంలో సుమారు 26 కి.మీ., దూరంలో కృష్ణ- తుంగభద్ర సంగమ ప్రాంతంలో 6వ శతాబ్దం నాటి నిర్మాణాలతో ఈ ఆలయం ఉండేది. అయితే శ్రీశైలం ప్రాజెక్టు నిర్మాణంలో భాగంగా ఈ ఆలయాలు ముంపునకు గురవుతాయని భావించిన కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు 1979లో సురక్షిత ప్రాంతానికి తరలించేందుకు పూనుకున్నారు. ఈ క్రమంలో కేంద్ర పురాతత్వ శాఖ ఆలయం నిర్మాణంలోని ప్రతి రాతికి క్రమ సంఖ్య వేసుకుని వాటిని తొలగించి అలంపూర్‌కు చేర్చారు. సంగమేశ్వర స్వామి మూలవిరాట్‌ను బాల బ్రహ్మేశ్వరస్వామి ఆలయంలో ఉంచి కళాకర్షన ప్రక్రియతో ప్రతినిత్యం అనువంశిక అర్చకులు పూజలు కొనసాగించారు. ఆ తర్వాత 1990 నాటికి పునర్నిర్మాణం పూర్తిచేసి సంగమేశ్వర ఆలయానికి పూర్వవైభవం తీసుకొచ్చారు. అనంతరం 1990 ఫిబ్రవరి మహాశివరాత్రి రోజు ఆలయంలో పుష్పగిరి పీఠాధిపతి విద్యానందభారతీ చేతుల మీదుగా పూర్వపు విగ్రహాన్ని పునఃప్రతిష్ఠ చేసినట్టు ప్రస్తుత ఆలయ అర్చకులు సంగమేశ్వరయ్యస్వామి పేర్కొన్నారు.



వీరభద్రస్వామి



రక్తబీజ సంహారుడు

అమలక శైలిలో శిఖరాగ్రభాగం

సంగమేశ్వర ఆలయంలోని ప్రతి విగ్రహం పురాణ, ఇతిహాసాలను ప్రతిబింబింపజేసేలా సందర్శకులను ఆకట్టుకుంది. సత్యలోకంగా భావించి శిఖర దర్శనం అమలక (ఉసిరికాయ ఆకృతి) రూపాన్ని పోలి ఉంటుంది. ఈ నిర్మాణం మొత్తం ఎర్ర ఇసుకరాతిని కలిగి ఉంటుంది. సంగమేశ్వర స్వామి ఆలయ ప్రాధాన్యతను గుర్తించిన రాష్ట్ర ప్రభుత్వం సైతం గ్రామీణ బ్యాంకులను సంగమేశ్వర గ్రామీణ బ్యాంకుగా నామకరణం చేస్తూ ఈ ఆలయ వైభవాన్ని మరింత పెంపొందించారు.

■ కృష్ణ- తుంగభద్ర నదిలో ఆరు నదుల కలయిక స్థానంలో ఈ ఆలయ నిర్మాణం ఉండటంతో దీనికి సంగమేశ్వర ఆలయం అనే పేరు వచ్చింది. కృష్ణ, భీమ, మలప్రభ, తుంగ, భద్ర, హంద్రీనీవా నదుల కలయిక అయిన షణ్ణది నదుల మధ్య ఈ ఆలయం బాదామి చాళుక్యుల కాలంలో నిర్మించారు. ప్రస్తుతం ఈ ఆలయానికి 56 ఎకరాలు ఉండగా అవి శ్రీశైలం ప్రాజెక్టులో ముంపునకు గురయ్యాయి. 1975లో ముంపునకు గురైన భూములకు నష్టపరిహారంగా రూ.1,03,600 అందజేశారు. ప్రస్తుతం ఆ డబ్బు మహబూబ్‌నగర్ దేవాదాయశాఖ ఆధీనంలో ఉంది.

■ ఈ పూర్వ సంగమ స్థానాన్ని దక్షిణగయ అని కూడా చెప్పేవారు. దీనికి నిదర్శనంగా విష్ణు పాదంపై పిండప్రదానం చేస్తున్నట్టుగా మరో విగ్రహం కూడా కనిపిస్తుంది. ఇందుకోసమే అలంపూర్ ఆలయాలను దక్షిణకాశీ అని, సంగమ స్థానాన్ని దక్షిణ గయగా పిలిచేవారు. ఈ ఆలయంలో యమునా విగ్రహం, హరిహర, యముడు, రాహువు, కాలభైరవుడు, నైరుతేశ్వరుడు, మన్మథుడు, వరుణ, వాయువు, పద్మధరుడు అనే బాదామి చాళుక్యులలో మూలపురుషుడి విగ్రహం ఉంటుంది. ఇవేకాకుండా నటరాజ, కుబేర, దిగంబర, అర్ధనారీశ్వర, ఆంజనేయ, గణపతి విగ్రహాలు ఉంటాయి. ఆలయంలోని సోపానాల (మెట్లు) చుట్టూ భూలోక పరిపాలకుల విగ్రహాలు, మల్ల యోధులు, భూమిపై నివసించే పశు పక్షాదులు, నాట్యకారుల విగ్రహాలుంటాయి. ముఖద్వారమైన సువర్లోకంగా పిలవబడే ఈ భాగంలో పార్వతి, వీరభద్ర, గణపతి, నంది విగ్రహాలను చూడవచ్చు. నందికి పైభాగంలో కప్పు పై చక్రం మధ్యలో అమ్మవారి విగ్రహాన్ని వసు కోణాలతో పొందపరిచారు. ఇక గర్భాలయంలోని మహర్లోకంగా భావించే ప్రదేశంలో సంగమేశ్వర స్వామి లింగరూపంలో దర్శనమిస్తారు.



ఆలయ పైకప్పులో శ్రీచక్రం కొలువైన లక్ష్మీదేవి

ఆలయ ప్రచారంపై దృష్టిపెట్టాలి



సంగమేశ్వర ఆలయం ఎంతో మహిమాన్వితమైనది. కోరిన వారికి కొంగుబంగారంగా అనుగ్రహించే ఈ స్వామివారి ఆలయానికి రాష్ట్ర ప్రభుత్వం చక్కటి ప్రచారం కల్పించింది. ఎంతో మంది ప్రతినిత్యం అలంపూర్ జోగుళాంబ ఆలయాలను సందర్శిస్తున్నారు. అలాంటి భక్త యాత్రికులు సంగమేశ్వర ఆలయం చూసేలా సూచిక బోర్డులు ఏర్పాటు చేయాలి. – టీవీ బాబు, జోగుళాంబ సేవాసమితి ఉపాధ్యక్షుడు

ఇదీ ఆలయ వైభవం


6వ శతాబ్దం బాదమీ చాళుక్యుల కాలంలో ఐహోలు, పట్టడికల్ వంటి నిర్మాణ శైలిని పోలిన ఈ ఆలయాలు దేశానికి గర్వకారణంగా నిలిచాయి. ఆలయంలో ద్వార పాలకులుగా బౌద్ధ శిల్పాలు శంకనిధి, పద్మనిధిలు అమర్చారు. ప్రధానంగా ఆలయంలో పర్యాటకులు, భక్త యాత్రికులను ఆకట్టుకునేలా ఆనాటి శిల్పుల కళావైభవాన్ని చూడవచ్చు. ఈ క్రమంలో ఆలయం పైకప్పు వాయువ్య భాగంలో ఉన్న మొసలి శిల్పం నోటిలో మనిషి చెక్కబడి ఉంటుంది. అయితే ఒకవైపు నుంచి ఈ విగ్రహాన్ని చూస్తే మొసలి నోట్లో బాల్యం.. మరోవైపు నుంచి పరిశీలనాత్మకంగా చూస్తే యవ్వనంతో.. మరోవైపు వృద్ధాప్య దశలో ఉన్నట్టుగా చెక్కబడింది. ఒక విగ్రహం, బాల్యం, యవ్వనం, కౌమార దశలలో మలచబడి ఉన్న ఆనాటి శిల్పుల కళానైపుణ్యత నేటి తరాన్ని మంత్రముగ్ధులను చేస్తుంది. అయితే ఈ ఆలయం కృష్ణ- తుంగభద్ర నదుల మధ్య ఉండటంతో నదిలోని మొసలి నివాసం ఉన్నాయనే విషయాన్ని గుర్తు చేస్తూ నంది విగ్రహాలకు బదులుగా మొసలిని ఉంచడం విశేషం. అలాగే కాలభైరవ విగ్రహం కూడా ఒక పౌరాణిక నేపథ్యాన్ని తెలియజేస్తుంది. ఈ విగ్రహాన్ని రక్తబీజ సంహారుడు కూడా అంటారు. ఈ విగ్రహంలోని త్రిశూలానికి రక్తబీజుడు, కిందిభాగంలో భైరవీమాత కనిపిస్తుంది. ఇది దేవీ భాగవతానికి సంబంధించిన కథను తెలియజేస్తుంది.



మనిషిని మొసలి కబలించేలా ఉన్న విగ్రహం



మొసలి నోటిలో బాల్య దశలో కనిపించే విగ్రహం




ఆలయ అంతర్భాగం

మందు కల్లు విక్రయాలపై ఎక్సైజ్ శాఖ ఉదాసీనత

- బాధితులు మృతి చెందినా, వింతగా ప్రవర్తిస్తున్నా రాని **కదలిక**
- తూతూమంత్రపు తనిఖీలు, **నమూనాల** సేకరణకే పరిమితం
- తాజాగా 10 మంది ఆస్పత్రి**లో చేరినా** షరా'మామూలు'గా వ్యవహా**రం**
- శాంపిళ్లు ల్యాబ్‌కు పంపించా**మని** చేతులు దులుపుకొంటున్న **అధికారులు**
- రోజు గడిచినా ఆస్పత్రి వర్గాలు **సీక్రెట్‌గా** ఉంచడంపై విమర్శలు
- దీని వెనక ఓ కల్లు వ్యాపారి?

'కల్తీ' కక్కుర్తికి ఏదీ చికిత్స..!





దొడ్డలోనిపల్లిలోని ఓ దుకాణంలో కొనసాగుతున్న కల్లు విక్రయాలు

సాక్షి ప్రతినిధి, మహబూబ్‌నగర్: ఉమ్మడి పాలమూరు వ్యాప్తంగా కల్తీకల్లు దందా జోరుగా సాగుతోంది. ఈత వనాలు ఉన్నా, లేకున్నా బోరింగ్ నీళ్లు, బొంబై పౌడర్ ఏరులైపారుతోంది. మందు కల్లుకు బానిసలుగా మారి మృతి చెందినా, అస్వస్థతకు గురై వింతగా ప్రవర్తిస్తున్నా.. ఎక్సైజ్ శాఖ ఉదాసీనంగా వ్యవహరిస్తోంది. ఎవరైనా ఫిర్యాదు చేస్తే గానీ.. మీడియాలో హల్‌చల్ అయితే గానీ అధికారుల్లో కదలిక రావడం లేదు. ఒకవేళ చలనం వచ్చినా తూతూమంత్రపు తనిఖీలు.. శాంపిళ్ల సేకరణకే పరిమితమవుతున్నారు. డిపోలు, దుకాణాలవారీగా పలువురు అధికారులు, సిబ్బందికి నెలనెలా ముడుపులు అందుతుండడమే ఇందుకు కారణమనే విమర్శలు ఎప్పటినుంచో వినిపిస్తున్నాయి. అయినా ఉన్నతాధికారులు దృష్టి సారించకపోవడంపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

తాజా ఘటనలోనూ..

కల్తీ కల్లుకు అలవాటు పడిన మహబూబ్‌నగర్ పట్టణ పరిధిలోని కోయనగర్, దొడ్డలోనిపల్లి, మోతీనగర్‌కు చెందిన పది మంది పిచ్చిపిచ్చిగా, వింతగా ప్రవర్తిస్తూ శుక్రవారం జిల్లా జనరల్ ఆస్పత్రికి రావడం కలకలం సృష్టించింది. ఇందులో తొమ్మిది మంది కోలుకోగా, వారిని డిశ్చార్జి చేశారు. ఓ మహిళకు చికిత్స కొనసాగుతుండగా.. ఎలాంటి ప్రాణాపాయం లేదని వైద్యులు వెల్లడించారు. ఈ ఘటన శనివారం ఆలస్యంగా వెలుగులోకి రాగా వైరల్‌గా మారింది. దీంతో ఎక్సైజ్ శాఖ సిబ్బంది ఆయా ప్రాంతాల్లోని కల్లు దుకాణాలు, డిపోల్లో తనిఖీలు చేపట్టారు. సీహెచ్‌సీ టెస్ట్ చేసి ప్రాథమికంగా ఏం లేదని తేల్చడం విశేషం. ఆ తర్వాత షరా మామూలుగా శాంపిళ్లను పరీక్షల నిమిత్తం హైదరాబాద్‌లోని ల్యాబ్‌కు తరలించామని వెల్లడించి చేతులు దులుపుకున్నారు. ఈ ఫలితాలు వచ్చే సరికి ఐదారు నెలలకు పైగానే సమయం పట్టడం.. ఆ లోపు అంతా సర్దుకోవడం ఖాయంగా కనిపిస్తోంది. జడ్చర్లలో 2021 డిసెంబర్‌లో కల్తీ కల్లు మరణాలు చోటుచేసుకుంటే.. గత ఏడాది జూలైలో ఫలితాలు రావడం.. ఆ తర్వాతే సదరు కల్లు దుకాణ యజమానిని రిమాండ్‌కు పంపడం ఇందుకు నిదర్శనంగా నిలుస్తోంది.



శాంపిల్స్ సేకరిస్తున్న ఎక్సైజ్ సిబ్బంది



ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న బాధితులు

అంతా రహస్యం.. దీని వెనక ఎవరో..

కల్తీ కల్లుకు బానిసలుగా మారి వింతగా ప్రవర్తిస్తున్న బాధితులను వారి కుటుంబసభ్యులు శుక్రవారం మధ్యాహ్నం నుంచే జిల్లా ఆస్పత్రికి తీసుకురావడం మొదలైంది. ఇలా సాయంత్రం వరకు పది మంది వచ్చారు. చికిత్స అందించడంతో ఆరుగురు కోలుకున్నారు. అదే రోజు వైద్యులు వారిని ఇంటికి పంపించారు. తెల్లారి శనివారం ఉదయం మరో ముగ్గురు డిశ్చార్జి కాగా.. మరొక మహిళ ఆస్పత్రిలోనే చికిత్స పొందుతోంది. ఇలా కల్తీ కల్లు తాగి పిచ్చిపిచ్చిగా ప్రవర్తిస్తున్న వారి విషయాన్ని ఆస్పత్రి అధికారులు రోజంతా సీక్రెట్‌గా ఉంచడంపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఎప్పుడైతే ఈ విషయం వైరల్‌గా మారిందో.. ఆస్పత్రి సూపరింటెండెంట్ శనివారం మీడియాతో మాట్లాడుతూ ఎవరికీ ప్రాణాపాయం లేదంటూ వివరాలు వెల్లడించారు. అంతవరకు ఇది వెలుగులోకి రాకుండా కల్తీ కల్లు మాఫియాను శాసిస్తున్న ఓ వ్యక్తి చక్రం తిప్పినట్లు విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

ఆయనపై ఎందుకంత ప్రేమో..

కల్తీ కల్లు తాగి వింతగా ప్రవర్తిస్తూ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నట్లు సమాచారం అందుకున్న ఎక్సైజ్ సిబ్బంది అధికారుల ఆదేశాలతో తనిఖీలు చేపట్టారు. అయితే వారు దొడ్డలోనిపల్లి, బోయపల్లిలోని కల్లు దుకాణాలతోపాటు డిపోలో తనిఖీలు చేపట్టారు. తిమ్మసానిపల్లిలో మాత్రం చేపట్టలేదు. ఇక్కడే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. మహబూబ్‌నగర్ కేంద్రంగా కల్లు మాఫియాను పట్టణానికి చెందిన ఇద్దరు శాసిస్తున్నట్లు సమాచారం. పక్కపక్కనే కల్లు డిపోలు నిర్వహిస్తూ పోటాపోటీ దందా నిర్వహిస్తున్న వారి మధ్య ఎప్పటి నుంచో వైరం ఉంది. ఈ క్రమంలో ఒకరికి చెందిన వాటిపైనే తనిఖీలు చేపట్టడంపై చర్చ జోరుగా సాగుతోంది. అతడి పోటీదారుడు చెప్పినట్లే ఎక్సైజ్ సిబ్బంది నడుస్తున్నారనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. దీనిపై ఎక్సైజ్ అధికారిని సంప్రదించగా.. 'బాధితులు చెప్పిన వివరాల ప్రకారమే ఆయా దుకాణాల్లో తనిఖీలు చేశాం.. మాకు ఎవరిపై ప్రేమ లేదు, కోపం లేదు.. కల్లు డిపోలపై నిత్యం నిఘా ఉంచుతున్నాం' అని సమాధానమిచ్చారు. ఏదిఏమైనా కల్తీ కల్లుకు అలవాటు పడిన వారికి అవగాహన కల్పించి.. ఆ రక్కసి నుంచి బయటపడేలా చర్యలు తీసుకోవడంతోపాటు కల్తీ కల్లు మాఫియాపై ఉక్కుపాదం మోపాలని ప్రజల నుంచి అభిప్రాయం వ్యక్తమవుతోంది.

పొంగులేటి సమ్మేళనానికి జూపల్లి

- నేడు భద్రాద్రి కొత్తగూడెం వెళ్లనున్న మాజీ మంత్రి కృష్ణారావు
- వంద వరకు వాహనాలు సిద్ధం
- ఏ పార్టీలో చేరుతారన్న దానిపై ఉత్కంఠ



సాక్షి ప్రతినిధి, మహబూబ్‌నగర్: ఖమ్మం మాజీ ఎంపీ పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి నిర్వహించనున్న ఆత్మీయ సమ్మేళనానికి మాజీ మంత్రి జూపల్లి కృష్ణారావు హాజరుకానున్నారు. ఆదివారం భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో పొంగులేటి నిర్వహించనున్న సమ్మేళనం వేదికగా జూపల్లి తన గళం విప్పనున్నట్లు సమాచారం. ఈ సమావేశానికి సుమారు వంద వాహనాల్లో కొల్లాపూర్ నియోజకవర్గం పరిధిలోని ముఖ్యనాయకులు, కార్యకర్తలు తరలివెళ్లనున్నారు. నేటి సమావేశంలో బీఆర్‌ఎస్ ప్రభుత్వ తీరుపై బాహాటంగా విమర్శలు గుప్పించే అవకాశం ఉన్నట్లు ఆయన సన్నిహితుల మధ్య చర్చ సాగుతోంది. సీనియర్ రాజకీయ నేత, కాంగ్రెస్, బీఆర్‌ఎస్ ప్రభుత్వంలో మంత్రిగా పనిచేసిన జూపల్లి గత ఎన్నికల్లో ఓటమి పాలయ్యారు. అప్పుడు కాంగ్రెస్ అభ్యర్థిగా ఉన్న బీరం హర్షవర్ధన్‌రెడ్డి తర్వాత బీఆర్‌ఎస్ పార్టీలో చేరినప్పటి నుంచి పార్టీలోనే అంతర్గత పోరు కొనసాగుతోంది. ఎన్నికలు సమీపిస్తున్న వేళ జూపల్లి ఏ పార్టీలో చేరనున్నారన్న దానిపై ఉత్కంఠ నెలకొంది. ఆదివారం కొత్తగూడెంలో నిర్వహించనున్న పొంగులేటి సమావేశానికి జూపల్లి తన అనుచరగణంతో హాజరుకానుండటం ఆసక్తి రేపుతోంది.

ఆచితూచి అడుగులు..

గత ఎన్నికల్లో జూపల్లి అనూహ్యంగా ఓటమి పాలైన తర్వాత ఆయనకు ప్రత్యర్థిగా ఉన్న బీరం హర్షవర్ధన్‌రెడ్డి బీఆర్‌ఎస్‌లో చేరారు. ఇరువురు ఒకే పార్టీలో ఉన్నా మొదటి నుంచి ఒకరికి ఒకరు అంటీ ముట్టనట్టుగా వ్యవహరిస్తున్నారు. తన అనుచరులను స్థానిక ఎమ్మెల్యే వేధింపులకు గురిచేస్తున్నారంటూ జూపల్లి బహిరంగ విమర్శలు చేస్తున్నారు. కొల్లాపూర్ నియోజకవర్గం పరిధిలో కేఎల్ఐ కాల్వ సమస్యలపై రైతులతో కలసి ధర్నాలు, నిరసన కార్యక్రమాలను చేపడుతున్నారు. అధికార బీఆర్‌ఎస్‌లో కొనసాగుతూనే స్థానిక ఎమ్మెల్యేపై విమర్శనాస్త్రాలు సంధిస్తున్నారు. ఇరువురి మధ్య సవాళ్లు, ప్రతి సవాళ్లతో బాహాటంగానే యుద్ధం కొనసాగుతోంది. అయితే బీఆర్‌ఎస్‌ని వీడి మరో పార్టీలో చేరే అంశంపై జూపల్లి ఆచితూచి అడుగులు వేస్తున్నట్లు తెలుస్తోంది. ఇప్పటివరకు పార్టీ మారే విషయాన్ని ముందుగా ప్రకటించకుండా వేచిచూసే ధోరణి అవలంబిస్తున్నారు. కాగా.. ఏ పార్టీలో చేరాలన్న దానిపై ఇప్పటికే పొంగులేటి, జూపల్లి కలిసి నిర్ణయానికి రానున్నట్లు చర్చ సాగుతోంది. ఇదివరకే ముఖ్య నాయకులు, అనుచరుల అభీష్టాలను తెలుసుకునేందుకు విస్తృతంగా సమావేశాలు నిర్వహించారు. ఎన్నికలు సమీపిస్తున్న వేళ పార్టీ మారే విషయమై ముహూర్తాన్ని ఖరారు చేసుకున్నట్లు ప్రచారం సాగుతోంది. ఈ నేపథ్యంలోనే పెద్ద సంఖ్యలో తన అనుచరులతో కలసి కొత్తగూడెంలో పొంగులేటి సమ్మేళనానికి హాజరుకానుండటం రాజకీయ వర్గాల్లో చర్చనీయాంశంగా మారింది.

వేరుశనగ క్వింటాల్ రూ.7,549

జడ్చర్ల/దేవరకద్ర: బాదేపల్లి మార్కెట్‌లో శనివారం వేరుశనగకు గరిష్ఠంగా రూ.7,549, కనిష్ఠంగా రూ.4,284 ధరలు లభించాయి. గరిష్ఠంగా మొక్కజొన్న రూ.2,090, జొన్నలు రూ.4,575, పత్తి రూ.7,739, పొద్దుతిరుగుడు రూ.4,710, ఉలువలు రూ.5,007, మినుములు రూ.7,480, ఆముదాలు రూ.6,064, రాగులు రూ.2,659, కందులు రూ.7,799, రూ.7,659, పెబ్బర్లు రూ.5,370 ధరలు లభించాయి. ధాన్యం ఆర్‌ఎన్‌ఆర్ రకం గరిష్ఠంగా రూ.1,564, కనిష్ఠంగా రూ.1,489 పలికింది.

■ దేవరకద్ర మార్కెట్ యార్డుకు శనివారం 2వేల బస్తాల ధాన్యం అమ్మకానికి వచ్చింది. ఈనామ్ టెండర్లలో సోనామసూరి ధర క్వింటాల్‌కు గరిష్ఠంగా రూ.2,212, కనిష్ఠంగా రూ.1,829గా నమోదయ్యాయి. హంస ధాన్యం గరిష్ఠంగా రూ.1,759, కనిష్ఠంగా రూ.1,443 పలకగా.. ఆముదాలు గరిష్ఠంగా రూ.5,826, కనిష్ఠంగా రూ.5,629గా ధరలు పలికాయి.

కృష్ణానది నీటితో పెద్ద చెరువు నింపుతాం



మినీ ట్యాంక్‌బండ్‌ను పరిశీలిస్తున్న మంత్రి శ్రీనివాస్‌గౌడ్ తదితరులు

మహబూబ్‌నగర్ మున్సిపాలిటీ: జిల్లాకేంద్రంలోని పెద్ద చెరువును కృష్ణానది నీటితో నింపుతామని రాష్ట్ర ఎక్సైజ్, క్రీడల శాఖ మంత్రి శ్రీనివాస్‌గౌడ్ చెప్పారు. ఇక ముందు జిల్లా వాసులు పుష్కరాల కోసం బీచుపల్లి, రంగాపూర్, తంగడి తదితర ప్రాంతాలకు వెళ్లాల్సిన అవసరం ఉండదన్నారు. శనివారం సాయంత్రం స్థానిక పెద్ద చెరువు వద్ద కొనసాగుతున్న మినీ ట్యాంక్‌బండ్ సుందరీకరణ, నెక్లెస్‌రోడ్డు, సస్పెన్షన్ బ్రిడ్జి, ఐలాండ్, అలాగే శిల్పారామం పనులను పరిశీలించారు. పూడికతీత పనులు వేగంగా పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. ఈ చెరువులో ఈత, పడవ పోటీలకు ఏర్పాట్లు చేస్తామన్నారు. శిల్పారామం అంటేనే ప్రత్యేకత ఉట్టిపడేలా తుది మెరుగులు దిద్దాలన్నారు. మహబూబ్‌నగర్‌ను పర్యాటకుల స్వర్గధామంగా మార్చాలన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ కేసీ నర్సింహులు, వైస్‌చైర్మన్ తాటి గణేష్‌కుమార్, ముడా చైర్మన్ గంజి వెంకన్న, రాష్ట్ర పర్యాటక శాఖ ఎండీ మనోహర్, సాగునీటి పారుదల శాఖ డీఈ మనోహర్ తదితరులు పాల్గొన్నారు.

రంజాన్ వేళలు

ఇఫ్తార్ 6-38 (ఆదివారం సాయంత్రం)

సహర్ 4-43 (సోమవారం తెల్లవారుజామున)

న్యూస్‌రీల్

82 మంది గైర్హాజరు

మహబూబ్‌నగర్ మున్సిపాలిటీ: జిల్లావ్యాప్తంగా పదో తరగతి వార్షిక పరీక్షలు ప్రశాంతంగా కొనసాగుతున్నాయి. శనివారం మ్యాథ్స్ పరీక్షకు మొత్తం 12,666 మందికి 12,584 మంది విద్యార్థులు హాజరయ్యారు. వీరిలో 12,559 మంది రెగ్యులర్ విద్యార్థులకు గాను 12,495 మంది (99.49శాతం) హాజరయ్యారు. ప్రైవేట్‌లో 107 మందికి గాను 89 మంది (83.17 శాతం) పరీక్ష రాశారు. అడిషనల్ కలెక్టర్ సీతారామారావు ఒక పరీక్ష కేంద్రాన్ని, డీఈఓ యాదయ్య ఎనిమిది, ఫ్లయింగ్ స్క్వాడ్ 24 కేంద్రాలను తనిఖీ చేశారు.

ఆన్‌లైన్ టికెట్లు


స్టేషన్ మహబూబ్‌నగర్: మహబూబ్‌నగర్ డిపో నుంచి హైదరాబాద్ వెళ్లే ప్రయాణికుల సౌకర్యార్థం ఆన్‌లైన్ ప్యాసింజర్ రిజర్వేషన్ సిస్టం (ఓపీఆర్‌ఎస్) అందుబాటులోకి తీసుకొచ్చినట్లు డిపో మేనేజర్ సుజాత శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. సూపర్‌లగ్జరీ బస్సులో హైదరాబాద్ వెళ్లే ప్రయాణికులు www.tsrtconline.in వెబ్‌సైట్‌లో ఆన్‌లైన్ టికెట్లు బుక్ చేసుకోవచ్చని, ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆమె కోరారు.

'ఒక్క చాన్స్ ఇవ్వండి'



అడ్డాకుల: తెలంగాణ రాష్ట్రం ఇచ్చిన సోనియాగాంధీ ఆకాంక్షను నెరవేర్చడానికి రాష్ట్రాన్ని పాలించే ఒక్క చాన్స్ కాంగ్రెస్‌కు ఇవ్వాలని డీసీసీ అధ్యక్షుడు జి.మధుసూదన్‌రెడ్డి విజ్ఞప్తి చేశారు. మూసాపేట మండలం నందిపేటలో హాథ్‌సే హాథ్ జోడో కార్యక్రమంలో భాగంగా శనివారం ఇంటింటికి వెళ్లి బీఆర్‌ఎస్ ప్రభుత్వ వైఫల్యాలను ప్రజలకు వివరించడంతో పాటు టీపీసీసీ ఆర్గనైజింగ్ సెక్రెటరీ కొండా ప్రశాంత్‌రెడ్డితో కలిసి పార్టీ సభ్యత్వం, బీమా కార్డులు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తాము అధికారంలోకి రాగానే రైతులకు ఏకకాలంలో రూ.2 లక్షల రుణమాఫీ అమలు చేస్తామని తెలిపారు. ఇంటి నిర్మాణానికి రూ.5లక్షలు, రూ.500లకే గ్యాస్ సిలిండర్ ఇవ్వడంతో పాటు అర్హులైన వారికి ఇంట్లో ఇద్దరికి పింఛన్ మంజూరు చేస్తామని ప్రకటించారు. సాధిక్, కొండా జగదీశ్వర్, శెట్టిశేఖర్, నాగిరెడ్డి, లక్ష్మీనారాయణ, శ్రీనివాస్ యాదవ్, ప్రభాకర్‌రెడ్డి, లక్ష్మీకాంత్‌రెడ్డి, రాంరెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి ఉన్నారు.





క్లుప్తంగా

సెల్‌ఫోన్ చూడొద్దన్నారని.. బాలిక బలవన్మరణం


ఐశ్వర్య (ఫైల్)

మానవపాడు: పరీక్షల సమయం కావడంతో సెల్‌ఫోన్ చూడకుండా చదువుకోవాలని తల్లి మందలించిందని మనస్తాపానికి గురైన ఓ బాలిక పురుగు మందు తాగి బలవన్మరణానికి పాల్పడింది. హెడ్‌కానిస్టేబుల్ తిప్పన్న కథనం ప్రకారం.. మండలంలోని అమరవాయికి చెందిన బోయ గోస్, మణెమ్మ దంపతుల కుమార్తె ఐశ్వర్య(15) బాలిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 8వ తరగతి చదువుతుంది. ఈ క్రమంలో ఈ నెల 6న ఎప్పుడూ సెల్‌ఫోన్ చూడొద్దని, చదువుకోవాలని తల్లి మణెమ్మ మందలించింది. దీంతో మనస్తాపానికి గురైన బాలిక క్షణికావేశంలో సాయంత్రం పురుగు మందు తాగింది. గమనించిన కుటుంబ సభ్యులు బాలికను మానవపాడు ప్రభుత్వ ఆస్పత్రికి, అక్కడి నుంచి కర్నూలు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. అక్కడే చికిత్స పొందుతూ శుక్రవారం రాత్రి మృతిచెందింది. ఈ ఘటనపై కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు బాలిక మృతదేహానికి పోస్టుమార్టం నిర్వహించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు హెడ్‌కానిస్టేబుల్ తెలిపారు.

అప్పుల బాధతో వ్యక్తి..


శంకర్ (ఫైల్)

బిజినేపల్లి: తిమ్మాజీపేట మండలంలోని రాళ్లచెరువుతండాకు చెందిన శంకర్(45) శనివారం ఉదయం తన వ్యవసాయ పొలం వద్ద చెట్టుకు ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. గ్రామస్తుల కథనం ప్రకారం.. శంకర్ కుటుంబ అవసరాల నిమిత్తం అప్పులు చేశాడు. అవి ఎలా తీర్చాలో తెలియక మనస్తాపానికి గురై శనివారం తెల్లవారుజామున చెట్టుకు ఉరేసుకుని మృతిచెందాడు. ఉదయం 10 గంటల సమయంలో అదే గ్రామానికి చెందిన పక్క పొలం రైతు గమనించి కుటుంబ సభ్యులకు సమాచారం అందించడంతో వారు అక్కడికి చేరుకుని బోరున విలపించారు. శంకర్‌కు భార్యతోపాటు ఇద్దరు కుమారులు, ఒక కూతురు ఉన్నారు.

తండ్రి డబ్బులు ఇవ్వలేదని..

గద్వాల క్రైం: మండలంలోని యువకుడు ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. రూరల్ ఎస్‌ఐ ఆనంద్ తెలిపిన వివరాలిలా.. మండలంలోని కుర్వపల్లికి చెందిన శివ (21) దినసరి కూలీగా పని చేస్తున్నాడు. కొన్ని రోజులుగా మద్యానికి అలవాటు పడ్డాడు. శుక్రవారం రాత్రి 10:30 గంటల సమయంలో అప్పటికే తాగి వచ్చిన శివ తన తండ్రి పరందాములను రూ. వెయ్యి ఇవ్వాలని అడిగాడు. తండ్రి డబ్బులేవని, మద్యం తాగడం మానుకొని బుద్ధిగా ఉండాలని మందలించాడు. తండ్రి డబ్బులు ఇవ్వకపోవడంతో మనస్తాపం చెందిన శివ ఇంట్లోకి వెళ్లి తలుపులు వేసుకున్నాడు. కొద్దిసేపటి తర్వాత అనుమానం వచ్చిన తండ్రి పిలువగా ఎంతటికీ పలుకకపోవడంతో ఆందోళనకు గురైయ్యాడు. ఇంటి పక్క వారి సాయంతో తలుపులు విరగొట్టి లోపలికి వెళ్లి చూడగా దూలానికి చీరతో ఉరి వేసుకుని వేలాడుతూ అపస్మారక స్థితిలో కన్పించాడు. వెంటనే కొడుకును చికిత్స నిమిత్తం గద్వాల జిల్లా ప్రభుత్వ ఆస్పత్రికి తీసుకెళ్లారు. వైద్యులు పరీక్షించి అప్పటికే మృతి చెందినట్లు నిర్ధారించారు. తండ్రి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

సలేశ్వరంలో కర్ణాటక యువతి అదృశ్యం


గాయత్రి

లింగాల: నాగర్‌కర్నూల్ జిల్లా లింగాల మండలంలోని నల్లమల లోతట్టు ప్రాంతంలోని సలేశ్వర పుణ్య క్షేత్రంలో కర్ణాటక రాష్ట్రానికి చెందిన ఓ యువతి అదృశ్యమైన సంఘటన శనివారం ఆలస్యంగా వెలుగు చూసింది. పోలీసులు, కుటుంబ సభ్యుల కథనం ప్రకారం.. ఈ నెల 6న కర్ణాటక రాష్ట్రం రాయచూరుకు చెందిన గాయత్రి(25) కుటుంబ సభ్యులతో కలిసి లింగమయ్య దర్శనానికి వచ్చింది. కాగా కుటుంబ సభ్యులతో కలిసి వెళ్తుండగా రద్దీ అధికంగా ఉండడంతో యువతి విడిపోయింది. దైవ దర్శనం చేసుకున్న కుటుంబ సభ్యులు 7న లోయ పైకి వచ్చి వెతికినా ఆచూకీ దొరకలేదు. పోలీసులతో అనౌన్స్‌మెంట్ చేయించినా ఫలితం లేకపోయింది. దీంతో యువతి తండ్రి రవీంద్రస్వామి శనివారం లింగాల పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేశాడని, ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు హెడ్‌కానిస్టేబుల్ వెంకటేశ్వర్లు తెలిపారు.

ఆత్మహత్యకు పాల్పడిన యువతి వివరాలు లభ్యం

జడ్చర్ల: కావేరమ్మపేట శివారులో శుక్రవారం రైలు కింద పడి ఆత్మహత్యకు పాల్పడిన యువతిని శనివారం కుటుంబ సభ్యులు గుర్తించినట్లు రైల్వే హెడ్‌కానిస్టేబుల్ శ్రీనివాసులు తెలిపారు. బాలానగర్‌లో నివాసం ఉంటున్న సింధు(24) పోలేపల్లి సెజ్‌లోని ఫార్మా కంపెనీలో ఉద్యోగం చేస్తుంది. యువతి తను ప్రేమించిన యువకుడిని పెళ్లి చేసుకోవాలని కోరగా ప్రియుడు అంగీకరించకపోవడంతో మనస్తాపం చెంది ఆత్మహత్యకు పాల్పడిందని హెడ్‌కానిస్టేబుల్ తెలిపారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు పేర్కొన్నారు.

తుది దశలో ఆర్‌ఓబీ

- దేవరకద్రలో తీరనున్న ట్రాఫిక్ కష్టాలు
- వచ్చే నెలలో ప్రారంభించేందుకు సన్నాహాలు


ఆర్‌ఓబీపై కొనసాగుతున్న పనులు

దేవరకద్ర రూరల్: పట్టణంలోని ఆర్‌ఓబీ పనులు ప్రస్తుతం తుదిదశకు చేరుకున్నాయి. ఈ నిర్మాణం వలన 5 ఏళ్లుగా ట్రాఫిక్ జామ్, దుమ్ము, గుంతల రోడ్డులతో నిత్య నరకం అనుభవించిన ప్రజలకు ఊరట లభించనుంది. ఈ నెల చివరి వరకు అన్ని పనులను పూర్తి చేస్తామని అధికారులు చెబుతుండడంతో ప్రజలు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

2014లో నిధులు మంజూరు..

దేవరకద్ర మీదుగా రాకపోకల రద్దీని దృష్టిలో ఉంచుకుని ఆర్‌ఓబీ నిర్మాణానికి 2010లో ప్రతిపాదనలు రాగా, 2014లో అప్పటి ప్రభుత్వం గ్రీన్‌సిగ్నల్ ఇచ్చి రూ.24.50 కోట్లను కేటాయించింది. రైల్వే పరిధిలోని పనులు ప్రారంభించి 2015లో పూర్తి చేశారు. మిగితా పనులకు కాంట్రాక్టర్ ముందుకు వచ్చి ప్రారంభించకపోవడంతో ఒప్పందం రద్దు చేసి, రీ ఎస్టిమేట్‌తో కొత్త టెండర్లను పిలిచి, 2019లో పనులను మరొకరికి అప్పగించారు. దీనికిగాను 2021 చివరి వరకు బ్రిడ్జి పనులు పూర్తి చేయాలని ఒప్పందం చేసుకున్నారు. కోవిడ్ వ్యాప్తితో లాక్‌డౌన్ కావడం, బిల్లులు చెల్లించకపోవడంతో ఆరు నెలల గడువు పెంచుతూ 2022 వరకు పూర్తి చేయాలని ఆదేశాలు ఇచ్చారు. నిర్ణీత సమయంలోపు పనులు పూర్తి కాకపోవడంతో డిసెంబర్ 2022 వరకు గడువును పొడిగించారు. పెంచిన గడువు దాటి నాలుగు నెలలు అవుతున్న క్రమంలో ఎట్టకేలకు పనులు తుది దశకు చేరుకున్నాయి.

తీరనున్న ట్రాఫిక్ కష్టాలు..

హైదరాబాద్ – రాయచూర్ అంతర్రాష్ట్ర రహదారి కావడంతో నిత్యం వేల సంఖ్యలో వాహనాలు దేవరకద్ర మీదుగా రాకపోకలను కొనసాగిస్తుంటారు.


రైల్వే గేట్ వేయడంతో ఏర్పడిన ట్రాఫిక్ జామ్ (ఫైల్)

అలాగే దేవరకద్ర మీదుగా ఉన్న రైలు మార్గంలో హైదరాబాద్- కర్నూల్ వైపు పదుల సంఖ్యలో రైళ్లు వెళ్తుంటాయి. తరుచుగా రైల్వే గేటు పడుతుంది. ఆర్‌ఓబీ పనులు కొనసాగుతున్న క్రమంలో రాకపోకలకు ఉన్న మార్గం ఇరుకుగా ఉండటంతో నిమిషాల వ్యవధిలోనే రెండు వైపులా వాహనాలు పెద్ద ఎత్తున నిలిచిపోయేవి. అత్యవసర పరిస్థితుల్లో చికిత్స కోసం ఆస్పత్రికి వెళ్లేవారు, ప్రభుత్వ ఉద్యోగులు, విద్యార్థులు ట్రాఫిక్‌లో చిక్కుకుని నరకం అనుభవించేవారు.

రైల్వే గేటుపై వీడని సందిగ్ధం

ట్రాఫిక్ సమస్యను దృష్టిలో ఉంచుకుని నిర్మించిన ఆర్‌ఓబీ పనులు పూర్తయ్యాయి. దక్షిణ మధ్య రైల్వే నిబంధనల ప్రకారం ఆర్‌ఓబీ ఉన్న స్థలంలో రైల్వే గేట్‌ను మూసివేసి ఆ దారిలో రాకపోకలను నిషేధిస్తారు. ఇదే క్రమంలో స్థానిక అవసరాల కోసం కొత్త బస్టాండ్ నుంచి పాత బస్టాండ్ వరకు రాకపోకలను కొనసాగించే వారు బ్రిడ్జిపై నుంచి వెళ్లి రావాలంటే ఇబ్బందులు ఎదుర్కొంటారు. ముఖ్యంగా బస్టాండ్ ఆర్‌ఓబీకి మధ్యలో ఉండటంతో బస్సులు ఫ్లైఓవర్‌పై నుంచి వెళ్లి రావాలంటే ట్రాఫిక్ జామ్ అయ్యే అవకాశాలు ఉన్నాయి. ఇబ్బందులను దృష్టిలో పెట్టుకుని ప్రస్తుతం ఉన్న పాతదారిని కొనసాగించాలని ప్రజలు కోరుతున్నారు.

ఈ నెల చివరి వరకు పూర్తి చేస్తాం:



ప్రస్తుతం ఆర్‌ఓబీ పనులు తుది దశలో ఉన్నాయి. బ్రిడ్జి, రోడ్డు నిర్మాణం దెబ్బతినకుండా ఎక్కువ కాలం నాణ్యతగా ఉండేలా రోడ్డు మధ్యలో ఆస్ఫాల్ట్ మ్యాట్రిక్ షీట్స్‌ను ఉపయోగిస్తున్నాం. షీట్స్ దొరకడంలో ఆలస్యం కావడం వల్ల పనులు నెమ్మదిగా సాగాయి. ప్రారంభోత్సవానికి ముందే రెండు రోజులు వాహనాలను పైనుంచి దారి మళ్లించి, రద్దీని నియంత్రించి కింద ఇరువైపులా సర్వీస్ రోడ్లను వేయడంతో పాటు అన్ని పనులను ఈ నెల 25 వరకు పూర్తి చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నాం. – కౌశిక్, ఆర్‌అండ్‌బీ ఏఈ

గేట్‌ను తెరిచి ఉంచాలి



ఆర్‌ఓబీ పనులు నత్తనడకన కొనసాగడం వల్ల ఏళ్లుగా తీవ్ర ఇబ్బందులు పడ్డాం. ఇప్పటికైనా పనులు పూర్తి కావడం సంతోషంగా ఉంది. అలాగే బ్రిడ్జి కింద ఉన్న రైల్వే గేట్‌ను మూసి, రాకపోకలకు అనుమతి ఉండదని చెబుతున్నారు. పట్టణం రైల్వే గేట్‌కు అటు, ఇటు పూర్తిగా విస్తరించి ఉంది. అందరూ ఆర్‌ఓబీ నుంచి వెళ్లి రావాలంటే రద్దీ ఏర్పడే అవకాశం ఉంది. దీనిపై అధికారులు పునరాలోచించాలి. – రంజిత్ గౌడ్, దేవరకద్ర

సెల్‌ఫోన్ లొకేషన్‌తో.. ప్రాణాలు కాపాడారు


అంజప్పను ఆస్పత్రిలో చేరుస్తున్న పోలీసులు

నారాయణపేట రూరల్: ఆత్మహత్య చేసుకుంటున్నట్లు కాల్ చేసి చెప్పడంతో ఆ సెల్‌ను ట్రాప్ చేసి లొకేషన్ ఆధారంగా సదరు వ్యక్తి ప్రాణాలను పోలీసులు కాపాడిన సంఘటన నారాయణపేటలో చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళ్తే.. పట్టణంలోని బహార్‌పేటకు చెందిన అంజప్ప(36) ఇంట్లో కొంత కాలంగా కుటుంబ కలహాలు నెలకొన్నాయి. ఈ క్రమంలో విసుగు చెందిన అంజప్ప శనివారం ఇంట్లో నుంచి వెళ్లిపోయాడు. కొద్ది సమయం తర్వాత ఇంటికి ఫోన్ చేసి తాను పురుగు మందు తాగానని, కాసేపట్లో చనిపోతున్నానని చెప్పాడు. ఎక్కడ ఉన్న విషయం చెప్పకపోవడంతో కుటుంబ సభ్యులు పోలీసులను ఆశ్రయించారు. వెంటనే స్పందించిన సీఐ రవిబాబు, ఎస్‌ఐ సురేష్ ఆయన ఫోన్‌ను ట్రాప్ చేసి లొకేషన్‌ను గుర్తించి అక్కడికి చేరుకున్నారు. కొండారెడ్డిపల్లి చెరువుశివారులో చెట్టు కింద పురుగు మందు తాగి అపస్మారక స్థితికి చేరుకోవడంతో జిల్లా ఆస్పత్రికి తరలించి చికిత్స చేయించారు. సమయానికి తీసుకురావడంతో ప్రాణాపాయం లేదని, రెండు రోజుల్లో కోలుకుంటాడని వైద్యులు తెలిపారు.

నేడు మెగా జాబ్ మేళా


మాట్లాడుతున్న రాష్ట్ర అధ్యక్షుడు నవీన్

అలంపూర్: మెగా జాబ్ మేళాను విజయవంతం చేయాలని స్వేరోస్ స్టూడెంట్స్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు నవీన్ కోరారు. పట్టణంలో శనివారం ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడుతూ.. ఆదివారం స్వేరోస్ ఎడ్యుకేషనల్ ఫౌండేషన్ అధ్వర్యంలో అలంపూర్ చౌరస్తాలోని వైష్ణవి పాఠశాలలో ఉదయం 10 గంటలకు మెగా జాబ్ మేళా ఉంటుందని తెలిపారు. ఐటీ, ఇతర కంపెనీల్లో ఉద్యోగ అవకాశాలు లభించనున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమానికి బీఎస్పీ రాష్ట్ర అధ్యక్షుడు ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ హాజరవుతున్నట్లు తెలిపారు. నియోజకవర్గంలోని యువతీ, యువకులు అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. సమావేశంలో హేమంత్, శ్యామ్, సురేష్, నరేష్, సంతోష్ ఉన్నారు.

తల్లి మరణవార్తను దిగమింగి పరీక్షకు..


పరీక్షకు హాజరైన విద్యార్థి సందీప్

చిన్నచింతకుంట: తల్లి చనిపోయిందని తెలిసినా పుట్టెడు దుఃఖంతోనే శనివారం పదో తరగతి పరీక్షకు సందీప్ అనే విద్యార్థి హాజరయ్యాడు. ఈ సంఘటన చిన్నచింతకుంట మండలం తిర్మలాపురం గ్రామంలో చోటుచేసుకుంది. గ్రామానికి చెందిన అంగన్‌వాడీ టీచర్ లక్ష్మి(42) కొంతకాలంగా కిడ్నీ సంబంధిత వ్యాధితో బాధపడుతూ శుక్రవారం రాత్రి మరణించింది. లక్ష్మికి భర్త బ్రహ్మానందరెడ్డి, ఇద్దరు కుమారులు ఉన్నారు. చిన్న కుమారుడు సందీప్ ప్రస్తుతం ఆత్మకూర్‌లో పదో తరగతి పరీక్ష రాస్తున్నాడు. తల్లి మృతి విషయం ఉదయం తెలిసినా, గణితం పరీక్ష రాశాక తల్లి అంతిమయాత్రలో పాల్గొన్నాడు. ఈసందర్భంగా సందీప్ రోదనలు పలువురిని కంటతడి పెట్టించాయి.

వ్యక్తి రిమాండ్

ఉండవెల్లి: మండల కేంద్రానికి చెందిన బాలికతో అదే గ్రామానికి చెందిన వేణుగోపాల్ గత నెల 31న అసభ్యకరంగా ప్రవర్తించడంతో తల్లి స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. కేసునమోదు చేసుకున్న పోలీసులు శుక్రవారం గద్వాల కోర్టులో హాజరుపర్చగా న్యాయమూర్తి గాయత్రి 14 రోజుల రిమాండ్ విధించినట్లు ఎస్‌ఐ బాలరాజు తెలిపారు.

హుండీ చోరీ

శాంతినగర్: పట్టణంలోని మారుతీనగర్ ఆంజనేయ స్వామి ఆలయం హుండీ శుక్రవారం రాత్రి చోరీకి గురైందని కాలనీవాసులు తెలిపారు. మూడు నెలలుగా హుండీ లెక్కించలేదని.. శ్రీరామనవమికి భక్తులు హుండీలో బాగా డబ్బులు వేశారని వివరించారు. సుమారు రూ.25 వేల నుంచి రూ.35 వేల వరకు ఉండవచ్చని తెలిపారు. పది రోజుల క్రితమే జమ్ములమ్మ ఆలయంలో హుండీ పగులగొట్టి డబ్బులు తీసుకెళ్లారని.. పోలీసులు రాత్రి వేళల్లో గస్తీ పెంచి, మరోమారు జరగకుండా చూడాలని వారు కోరుతున్నారు.

ఇథైల్ ద్రావణంలో మాగించాలి

పాడి-పంట
అధికారి సలహా: సక్రియనాయక్, ఏడీఏ, అలంపూర్


పసుపు రంగులో ఉన్న మామిడి


మాగించేందుకు సిద్ధంగా ఉన్న మామిడి

అలంపూర్: మామిడిలో పోషకాలు అత్యంత విలువైనవి. అందుకే పండ్లలో వీటిని రాజుగా గుర్తిస్తారు. ఇందులో విటమిన్-సీ 76 శాతం, విటమిన్-ఏ 25 శాతం, విటమిన్-బీ 6 నుంచి 11 శాతం, ఫైబర్ (పీచు) 9 శాతం, రాగి 9 శాతం, పొటాషియం 7 శాతం, మెగ్నీషియం 4 శాతం ఉంటుంది. మామిడి ఆరోగ్యం కాబట్టి వాటిని మాగించే పద్ధతులు, కోత కోసే సమయాల్లో తగు జాగ్రత్తలు తీసుకోవాలని ఏడీఏ సక్రియ నాయక్ రైతులకు సూచిస్తున్నారు.

మామిడి మాగించడం

మార్కెట్‌లోకి పంచదార కలప వంటి రకాలు ముందుగా వస్తాయి. పెద్ద రసం, చిన్న రసం, చెరుకు రసాల రకాలు తర్వాత అందుబాటులోకి వస్తాయి. బేనిషా రకం ఆ తర్వాత నీలం, బెంగుళూరు (తోతపరి, కలెక్టర్) రకాలు ఆలస్యంగా మార్కెట్‌లోకి వస్తాయి. ముందుగా వచ్చే పండ్లకు నాణ్యత ఉండదు. కార్బేట్ ఉపయోగించి రంగును తెప్పించి విక్రయిస్తారు. తర్వాత వచ్చే మామిడి పండ్లు రుచికరంగా ఉంటాయి. ఒక గదిలో గడ్డి లేదా వరిగడ్డి పరిచి వాటిపై కాయలు పేర్చి మళ్లీ గడ్డిని కప్పాలి. రెండు మూడు రోజుల్లోనే కాయలు మాగుతాయి. పండ్లు మంచి నాణ్యత కలిగి ఉంటాయి. అవసరమైతే మామిడికి మంచి రంగును తెప్పించడానికి ఇథైల్‌ను ఉపయోగించవచ్చు. ఇది కెమికల్ కాదు. ఇది హార్మోన్. లీటర్ నీటికి ఒక ఎంఎల్ నుంచి 1.8 ఎంఎల్‌ను ఉపయోగించి కాయలన్నింటికి సమానంగా రంగును తెప్పించి మాగపెట్టవచ్చు. ఇథైల్‌ను వేడి నీటిలో 52 డిగ్రీల సెల్సియస్ ఉష్ణోగ్రత వద్ద కలిపి కాయలను 5 నిమిషాలు ముంచి తీసి ఆరబెట్టాలి. మామిడి పండ్లను చెక్కపెట్టల్లో కాకుండా సీఎఫ్‌బీ పెట్టెల్లో ఉంచి రవాణా చేయవచ్చు. 5–10 కిలోల వరకు పెట్టెల్లో ఉంచి దూర ప్రాంతాలకు రవాణా చేసినా దెబ్బతినవు.

ప్రమాదకర పద్ధతులు

కొంత మంది రైతులు, వ్యాపారులు కాయలను మాగ పెట్టేందుకు ప్రమాదకరమైన పద్ధతులు పాటిస్తున్నారు. కాల్షియం కార్బైట్ అధికంగా వినియోగించి సరిగ్గా పక్వానికి రాని కాయలను కృత్రిమంగా రంగు తెప్పించి మార్కెట్‌లో విక్రయిస్తున్నారు. వీటికి మంచి రంగు ఉంటుంది కానీ రుచి ఉండదు. పుల్లగా ఉంటాయి. ఇలా మాగబెట్టినవి తినడం వలన ఆరోగ్యానికి హాని కలిగిస్తాయి. బాగా ముదిరిన కాయలను మాగబెట్టడానికి ఎలాంటి రసాయనాలు ఉపయోగించాల్సిన అవసరం ఉండదు.

గ్రేడింగ్ విధానం

కాయాలను గ్రేడింగ్ చేయడం ద్వారా అవసరమైన పరిమాణం, రంగు, బరువును బట్టి మంచి ధర లభించే అవకాశం ఉంటుంది. ఆవిరి ద్వారా (వేపర్ ట్రీట్‌మెంట్) కాయలను శుభ్రం చేసుకోవచ్చు. గ్రేడింగ్ చేయడం వలన రైతుకు వినియోగం కూడా లాభం చేకూరుతుంది. బరువును బట్టి గ్రేడింగ్ చేయవచ్చు. 200–250 గ్రాములు ఉన్న వాటిని మరో గ్రేడ్‌గా, 300 నుంచి 350 బరువు ఉన్న వాటిని ఇంకో గ్రేడ్‌గా తయారు చేస్తే మంచి ధర లభిస్తుంది.

ఆలయ భూములను పరిరక్షించాలి


మాట్లాడుతున్న సమితి సభ్యులు

పెబ్బేరు: ఆలయ భూములను పరిరక్షించాలని వేణుగోపాలస్వామి ఆలయ భూమి పరిరక్షణ సమితి ఆధ్వర్యంలో ఆదివారం పట్టణ బంద్‌కు పిలుపునిచ్చారు. శనివారం పట్టణ కేంద్రంలోని ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో పలువురు మాట్లాడారు. ప్రతి శనివారం నిర్వహించే సంత స్థలం 30 ఎకరాల 19 గుంటల భూమి వేణుగోపాలస్వామి ఆలయానికి చెందినదిగా తెలిపారు. దీంతో రోజురోజుకు అభివృద్ధి చెందుతూ రాష్ట్రంలోని పెద్ద సంతగా మారడంతో పాటు పెబ్బేరు మున్సిపాలిటీకి ప్రతి ఏడాది రూ.3 కోట్లు వేలం ద్వారా ఆదాయం వస్తుందన్నారు. కొందరు స్వార్థం కోసం దేవాలయ భూమిని పూజారుల పేరుపై ఓఆర్‌సీ తీసుకొచ్చి ప్లాట్లకు చదును చేస్తుండగా ఆలయ పరిరక్షణ సమితి సభ్యులు అడ్డుపడినట్లు తెలిపారు. ఆలయానికి చెందిన సగం భూమి సంతకు, సగం పూజారులకు ఉంటే ఆలయ అభివృద్ధి, పర్యవేక్షణ ఎలా నిర్వహిస్తారని అన్నారు. అనంతరం పట్టణ కేంద్రంలోని అన్ని దుకాణాలు, వ్యాపారులు స్వచ్ఛందంగా బంద్ పాటించి దేవాలయ భూమి రక్షణకు సహకరించాలని కోరారు. కార్యక్రమంలో బాలస్వామి, సహదేవుడు, దయాకర్‌రెడ్డి, రాములు యాదవ్, వెంకట్రాములు, శ్రీనివాస్‌రెడ్డి, సర్వారెడ్డి, యల్లయ్య, శ్రీనాథ్ తదితరులు పాల్గొన్నారు.

పట్టుబడిన బియ్యం మరోమారు పరిశీలన


బియ్యాన్ని పరిశీలిస్తున్న రాష్ట్ర సివిల్ సప్లయ్ టెక్నికల్ అధికారులు

వనపర్తి క్రైం: జిల్లా కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్ ఆదేశాల మేరకు శనివారం రాష్ట్ర పౌరసరఫరాలశాఖ టెక్నికల్ అధికారులు జిల్లాకేంద్రంలోని మారుతి రైస్ మిల్ నుంచి తరలిస్తూ పట్టుబడిన బియ్యాన్ని మరోమారు పరిశీలించారు. అధికారులు రషీద్, శ్రీనివాసరావు పట్టణ ఠాణాలో డీసీఎంలో ఉన్న బియ్యాన్ని సేకరించి పూర్తిస్థాయిలో పరిశీలన చేశారు. విచారణ నివేదికను కలెక్టర్‌కు అందజేయనున్నట్లు వివరించారు. వారి వెంట పౌరసరఫరాలశాఖ జిల్లా మేనేజర్ కొండల్‌రావు, స్థానిక తహసీల్దార్ రాజేందర్‌గౌడ్, ఎస్‌ఐ యుగంధర్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

వైభవంగా రామలింగేశ్వరస్వామి ఉత్సవాలు


రామలింగేశ్వర స్వామి ఆలయం వద్ద అగ్నిగుండం తొక్కుతున్న భక్తుడు


అగ్ని గుండం తొక్కుతున్న యువతి

చిన్నచింతకుంట: మండలంలోని చిన్నవడ్డెమాన్ సమీపంలో వెలసిన రామలింగేశ్వర స్వామి ఉత్సవాలు వైభవంగా కొనసాగుతున్నాయి. శనివారం తెల్లవారుజామున ఆలయ ప్రాంగణంలో అగ్నిగుండం కార్యక్రమం నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి శివ నామస్మరణతో అగ్నిగుండం తొక్కారు. అనంతరం ఆలయంలో స్వామి వారికి రుద్రాభిషేకం, అన్నపూర్ణ దేవికి సూక్తముగా అభిషేకం, కుంకుమార్చన చేపట్టారు.భక్తులకు తీర్థ ప్రసాదాలు, అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.

ప్రభుత్వ పాఠశాలలో పాము కలకలం

మాగనూర్: మండలంలోని ఉజ్జెల్లి ప్రాథమికోన్నత పాఠశాలలో పాము కలకలం సృష్టించింది. స్థానికులు, పాఠశాల ఉపాధ్యాయులు తెలిపిన వివరాల ప్రకారం.. రోజులాగానే శనివారం ఉదయం పాఠశాలకు వచ్చిన విద్యార్థులకు పాము కనిపించడంతో ఒక్కసారిగా భయందోళనకు గురయ్యారు. సంగం బండ బ్యాలెన్సింగ్ రిజర్వాయర్ ముంపు గ్రామమైన ఉజ్జెల్లిలో నిత్యం ఇదే తంతు నడుస్తుందని గ్రామస్తులు వాపోతున్నారు. పాఠశాల నిర్మాణం అసంపూర్తిగా ఉండటంతో నిత్యం పాములు తరగతి గదులోకి ప్రవేశిస్తున్నాయని తెలిపారు. అప్రమత్తమైన ఉపాధ్యాయులు ముందస్తుగానే విద్యార్థులను మరో తరగతి గదిలోకి పంపించారు.

కుక్కల దాడిలో లేగ దూడ మృతి

చిన్నచింతకుంట: కుక్కలు దాడి చేయడంతో లేగ దూడ మృతి చెందిన ఘటన మండలంలోని దాసర్ పల్లిలో శనివారం చోటు చేసుకుంది. గ్రామానికి చెందిన ముష్టి శ్రీనివాసులు తనకున్న ఆవును, లేగదూడను గ్రామ సమీపంలోని వ్యవసాయ పొలం వద్ద చెట్టుకు కట్టి ఉంచి ఇంటికి వచ్చాడు. ఎవరూ లేని సమయంలో లేగ దూడపై కుక్కలు దాడి చేశాయి. లేగ దూడకు గాయాలై అక్కడికక్కడే మృతి చెందింది. పొలాలలో కుక్కలు రెండు రోజులుగా గొర్రెలు, లేగ దూడలపై దాడిచేస్తుడడంతో రైతులు భయాందోళనకు గురవుతున్నారు. అధికారులు చర్యలు చేపట్టి కుక్కల బారి నుంచి కాపాడాలని కోరుతున్నారు.

సాక్షి క్లాసిఫైడ్స్

EDUCATION
ADMISSIONS
■Admissions for Guidence GNM/ B.Sc, M.Sc Nursing, B.Pharm, BPT, MPT, BAMS, BHMS, Few Seats Available. Cell: 7013038197, 8367566346, Hyd.

PLOT FOR SALE
■ షాద్‌నగర్ @ రాజాపూర్ దగ్గర, 0% ఇంట్రెస్ట్‌తో 30 నెలల EMI తో అన్ని డెవలప్మెంట్స్‌తో 147 గజాల MUDA=(HMDA) లేఔట్లో ఓపెన్ Plots కలవు. ఫ్రీ సైట్ విజిట్ ఫోన్ : 9949695027

FLAT FOR SALE
■ మ.నగర్ జిల్లా, న్యూ బాలాజీనగర్ నందు కొత్తగా నిర్మించిన అపార్ట్‌మెంట్‌లో 2BHK ఫ్లాట్స్ అమ్మకానికి గలవు. లిఫ్ట్, జనరేటర్స్, పాల్ సీలింగ్ వసతితో కూడిన Flats అమ్మకానికి గలవు. ✆ 9441382770, 7013510429.
■ మ.నగర్ S.R.నగర్ కాలనీలో కొత్తగా నిర్మించిన అపార్ట్‌మెంట్‌లో 2BHK ఫ్లాట్స్ 90% హౌజింగ్ లోన్ పాల్ సీలింగ్ లిఫ్ట్ అన్ని సౌకర్యాలు గల Flats అమ్మకానికి గలవు. ✆ 8309691870, 9553644993.

SERVICES
HEALTH CARE
GYNECOLOGY
■ కార్తీక్ హాస్పిటల్, సుంకేసుల రోడ్, కర్నూలు. సంతాన సమస్యలు, అన్ని రకాల స్త్రీ వ్యాధులు, జనరల్, బి.పి. షుగర్ వ్యాధులకు ఉత్తమ చికిత్స. డా॥ యస్.చంద్రశేఖర్, M.D. ఫిజిషియన్, డా॥ పార్వతి దేవి, M.D., DGO., స్త్రీ వ్యాధి, ల్యాపరోస్కోపి నిపుణులు. టైమింగ్స్: 10-8PM, 08518-226162

ORTHOPEDIC SURGEON
■డా॥యస్.రవితేజ రెడ్డి, M.S., (ORTHO) (KMC మణిపాల్) ఎముకలు, నరములు, వెన్నెముక & కీళ్ళ మార్పిడి శస్త్ర చికిత్స నిపుణులు. శిరీష పాలీ క్లినిక్, అపోలో హాస్పిటల్ ప్రక్కన, 3వ లైన్, N.R.పేట, కర్నూలు. 08518 – 228666, 83412 98888

PLOTS FOR SALE
కల్వకుర్తికి అతి దగ్గరలో DTCP గేటెడ్ కమ్యూనిటీలో అన్ని డెవలప్‌మెంట్స్‌తో అతి తక్కువ ధరకే Plots కలవు.
9392286353
9390324336

LEASE/RENT
■ 2000 Sft కలిగిన నాలుగు ఫ్లోర్లు ఉన్న కమర్షియల్ బిల్డింగ్ LEASE / RENT కి ఇవ్వబడును. ... Cell: 8328334865, 9440454472.

WANTED
■ Digital Marketing కొరకు Marketing Executives కావలెను సంప్రదించండి. ఫోన్ : 9959484341
■ 24 గంటలు ఇంటిలోనే ఉంటూ చిన్న శాకాహార కుటుంబానికి ఆడ వంట మనిషి కావలెను. ప్రదేశం : KPHB హైదరాబాద్. ఫోన్: 9348028160
■ HYDలో అర్జెంటుగా సెక్యూరిటీ గార్డ్స్, RTC కార్గో బస్‌లకు బాయ్స్, ఆటెండర్స్ కావలెను. ... సంప్ర: 040 -66366664, 9392663777, 9246663777
■ ఇంటర్, డిగ్రీ ఆపై చదువుకున్న యువతీ యువకులకు, గృహిణులకు గొప్ప అవకాశం. నెలకి మంచి ఆదాయం. 25000 పైన సంపాదన. 100% genuine opportunity. ✆ 80745 45356
■మ్యాన్ పవర్ & సెక్యూరిటీ ఫీల్డ్‌లో అనుభవమున్న ఫీల్డ్ ఆఫీసర్స్ కావలెను. Contact : Mega Group Man Power & Security. Cell : 70326 10569, 70931 25169.

■ కాంట్రాక్టు పద్ధతిలో హాస్పిటల్ లో వర్క్ చేయడానికి M/F స్టాఫ్ నర్స్, జూ. డాక్టర్స్, ల్యాబ్ టెక్నీషియన్స్ అ.కా.ను. Sal: 23K-37K ఇంట్రెస్టెడ్ ఉన్నవారు రెజ్యూమ్ వాట్సాప్ చేయగలరు. ఫోన్: 6281159171
■ ప్రముఖ సెల్‌ఫోన్ టవర్ మెయింటెనెన్స్ కంపెనీలో పనిచేయుట కొరకు ITI Electricians, / Deisel,/ Electronic / Machnical, Qualified Persons కావలెను. Contact Mobile No. 9177333978, 7995066305.

సాక్షి క్లాసిఫైడ్స్
ఈ సెక్షన్‌లో ప్రకటనల కొరకు
నాలుగు లైన్లకు రూ. : 200/- (Black & White)
అదనపు లైనుకు రూ. : 50
5% GST అదనం మాత్రమే
మహబూబ్‌నగర్ : 9010234478, 9010522215, 9705135557, 9010869797
జడ్చర్ల : 9010076222
నాగర్‌కర్నూల్ : 9010006785
వనపర్తి : 9010068317
గద్వాల : 9553955603
నారాయణపేట : 9010962007

గమనిక

క్లుప్తంగా...

అమిత్ షాతో నల్లారి భేటీ

సాక్షి, న్యూఢిల్లీ: బీజేపీలో చేరిన మాజీ ముఖ్యమంత్రి నల్లారి కిరణ్‌కుమార్‌రెడ్డి శనివారం కేంద్ర హోంమంత్రి అమిత్ షాతో భేటీ అయ్యారు. బీజేపీ జాతీయ అధ్యక్షుడు జేపీ నడ్డా నివాసంలో జరిగిన ఈ భేటీలో సంస్థాగత వ్యవహారాల పార్టీ ప్రధాన కార్యదర్శి బీఎల్ సంతోష్, కర్ణాటక ముఖ్యమంత్రి బసవరాజు బొమ్మై, మాజీ ముఖ్యమంత్రి యడియూరప్ప తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆంధ్రప్రదేశ్‌లో ప్రస్తుత పార్టీ పరిస్థితులతో పాటు కర్ణాటక ఎన్నికల్లో అనుసరించాల్సిన వ్యూహాలపై చర్చించారు. తెలుగు ప్రజలు ఎక్కువగా ఉండే నియోజకవర్గాల్లో ఏపీ నేతల ప్రచారంపైనా చర్చించినట్టు చెబుతున్నారు. ఇక కిరణ్‌కుమార్‌రెడ్డి చేరిక కార్యక్రమానికి దూరంగా ఉన్న రాష్ట్ర అధ్యక్షుడు సోము వీర్రాజు సైతం శనివారం సాయంత్రానికి ఢిల్లీ చేరుకున్నారు. అనంతరం కిరణ్‌కుమార్‌రెడ్డితో భేటీ అయ్యారు. ఇద్దరు నేతలు పలు అంశాలపై చర్చించున్న అనంతరం బీజేపీలోని మరికొంత మంది నేతలను కలిసినట్టుగా తెలిసింది.

'ఉపాధి' అనుసంధానానికి పోస్టుకార్డు ఉద్యమం

దుగ్గొండి: జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకాన్ని వ్యవసాయానికి అనుసంధానం చేయాలని డిమాండ్ చేస్తూ బీఆర్‌ఎస్ ఆధ్వర్యంలో చేపట్టిన పోస్టుకార్డుల ఉద్యమం శనివారం వరంగల్ జిల్లా దుగ్గొండి మండలం మహ్మదాపురం గ్రామంలో ప్రారంభమైంది. మంత్రి ఎర్రబెల్లి, ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి కేంద్ర గ్రామీణాభివృద్ధిశాఖ మంత్రికి పోస్టు కార్డులు వేశారు. కేంద్రంపై పోరాటానికి మహ్మదాపురం వేదిక అయిందని, ఆదివారం రాష్ట్రవ్యాప్తంగా ఉద్యమం సాగుతుందని ఎర్రబెల్లి తెలిపారు. గిరిజన యూనివర్సిటీ, కోచ్ ఫ్యాక్టరీ, ఇవ్వకుండా ఏ మొహం పెట్టుకొని ప్రధాని వచ్చారో చెప్పాలని ఆయన ప్రశ్నించారు.

చిరుధాన్యాల ఎగుమతులు పెరగాలి

సాక్షి, హైదరాబాద్: తెలంగాణ, ఏపీ నుంచి వ్యవసాయ, ప్రాసెస్డ్ ఫుడ్ ఉత్పత్తుల ఎగుమతులను పెంచేందుకు అవకాశాలు ఉన్నాయని అగ్రికల్చర్ అండ్ ప్రాసెస్డ్ ఫుడ్ ప్రొడక్ట్స్ ఎక్స్‌పోర్ట్ డెవలప్‌మెంట్ అథారిటీ చైర్మన్ డాక్టర్ ఎం.అంగముత్తు అన్నారు. 2023ను ఇంటర్నేషనల్ ఇయర్ ఆఫ్ మిల్లెట్స్‌గా ప్రకటించిన నేపథ్యంలో చిరుధాన్యాల ఎగుమతికి ఉన్న అవకాశాలను ఉపయోగించుకోవాలన్నారు. హైదరాబాద్‌లోని ఎపెడా ప్రాంతీయ కార్యాలయంలో తెలంగాణలోని చిరుధాన్యాలు, పప్పుధాన్యాలు, ప్రాసెస్డ్ ఫుడ్, పండ్లు తదితర రంగాలకు చెందిన ఎగుమతిదారులతో శనివారం సమావేశం నిర్వహించారు.

రూ. కోట్లు కొల్లగొట్టిన ఐపీజీ రెంట్!

- రెట్టింపు సొమ్ము పేరుతో నల్లగొండ జిల్లాలో దోపిడీ
- మునుగోడు మండలం పలివెలలో మోసపోయిన ప్రజలు
- మొదట్లో తక్కువ మొత్తం పెట్టిన కొందరికి రెట్టింపుతో తిరిగి చెల్లింపు
- పెట్టుబడి పెట్టే వారి సంఖ్య వందలకు చేరడంతో కుచ్చుటోపీ



సాక్షి ప్రతినిధి, నల్లగొండ/మునుగోడు: సైబర్ మోసగాళ్లు ఐపీజీ రెంట్ యాప్ పేరుతో కోట్ల రూపాయలు కొల్లగొట్టారు. పెట్టిన పెట్టుబడికి వారం రోజుల్లోనే రెట్టింపు వడ్డీ వస్తుందని ఆశ చూపించడంతో డబ్బులు పెట్టిన వందల మంది మోసపోయారు. హైదరాబాద్‌తోపాటు నల్లగొండ జిల్లాలోని పలివెలలో ఈ యాప్‌లో పెట్టుబడి పెట్టి డబ్బులు కోల్పోయిన బాధితులు ఇప్పుడు లబోదిబోమంటున్నారు. మొదట్లో ఒకరిద్దరుగా ఉన్నప్పుడు రెట్టింపు డబ్బులను తిరిగి పంపించిన యాప్ నిర్వాహకులు.. పెట్టుబడి పెట్టిన వారి సంఖ్య వందలకు చేరుకోవడంతో ముఖం చాటేశారు. ఐపీజీరెంట్.కామ్ పేరుతో ఉన్న వెబ్‌సైట్‌ను మూసేశారు. దీంతో బాధితులు ఇప్పుడు పోలీసులను ఆశ్రయించేందుకు సిద్ధమయ్యారు.

పలివెలకు ఎలా పాకిందంటే..

పలివెల గ్రామానికి చెందిన ఓ యువకుడు హైదరాబాద్‌లోని తన స్నేహితుడు పంపిన లింక్ ద్వారా ఐపీజీ యాప్‌లో 20 రోజుల కిందట రిజిస్టర్ చేసుకున్నాడు. హైదరాబాద్‌లో చాలా మంది పెట్టుబడి పెట్టారని, మంచి లాభం వస్తోందని తన స్నేహితుడు చెప్పడంతో అతను పలివెలకు వచ్చి ఈ విషయాన్ని తన స్నేహితులకు తెలియజేశాడు. దీంతో 15 రోజుల కిందట 10 మంది చేరారు. కొందరు రూ.2వేలు, మరికొందరు రూ.5 వేలు, ఇంకొందరు రూ.10 వేల చొప్పున పెట్టుబడి పెట్టారు. అలా పెట్టినవారికి వారం కిందటి వరకు చెప్పిన ప్రకారం వడ్డీతో పాటు అసలు జమ చేశారు. ఈ విషయం తెలిసి ఆ గ్రామంలో పలువురు ఒకరి తరువాత మరొకరు 150 మందికి పైగా రిజిస్టర్ చేసుకొని డబ్బులు పెట్టారు. గత శని, ఆదివారాల్లో రూ.30 వేలు పెట్టుబడి పెట్టిన వారికి అదనంగా రూ.30 వేలు కలిపి ఇస్తామని, వారం రోజులకు వడ్డీ రూ.27వేలు కలిపి మొత్తంగా రూ.87వేలు ఇస్తామని ఆశ చూపారు. దీంతో రూ.50 వేల నుంచి రూ.90 వేల చొప్పున పెట్టుబడి పెట్టారు. అయితే, మోసగాళ్లు ఈ నెల 5వ తేదీ నుంచి ముఖం చాటేశారు. ఫోన్‌చేస్తే సమాధానం రావడం లేదు. యాప్‌ను, వెబ్‌సైట్‌ను మూసేశారు. దీంతో డబ్బులు పెట్టిన వారంతా ఆందోళన చెందుతున్నారు

రూ.80 వేలు పెట్టి మోసపోయా



ఐపీజీలో పెట్టుబడి పెడితే అధిక వడ్డీ వస్తుందని ఆశపడి పది రోజుల కిందట చేరా. మొదట రూ. 2 వేలు పెట్టాను. వాటికి వడ్డీ, అసలు జమచేశారు. తిరిగి రూ.5 వేలు, రూ.10 వేల చొప్పున పెట్టా. అవీ వచ్చాయి. గత శనివారం రూ.30 వేలు, రూ. 50 వేలు పెడితే పెట్టిన నగదుకు డబుల్ వస్తాయని ఆశ చూపించారు. దీంతో రూ.80 వేలు పెట్టాను. ఆ తరువాత యాప్ ఓపెన్ కావడం లేదు.

– అనగంటి కృష్ణ, పలివెల

రూ. లక్షకు పైగా పోయాయి



మా గ్రామంలో చాలా మంది ఐపీజీలో చేరడంతో నేనూ వారం కిందట చేరాను. అందరిలాగే నేను మొదట్లో కొద్ది మొత్తం పెట్టాను. అవి రావడంతో రూ.1 లక్షకు పైగా పెట్టాను. ఆ తరువాత 3 రోజుల నుంచి యాప్ ఓపెన్ కావడం లేదు. ఐపీజీ ఏజెంట్ నంబరుకు ఫోన్ చేస్తే స్విచ్ఛాఫ్ వస్తోంది.

– రూపని బాలరాజు

టీఎస్‌పీఎస్సీ సభ్యులంతా కేసీఆర్ అనుచరులే..

- అందుకే ప్రభుత్వం వారిని కాపాడుతోంది
- కొత్త కమిషన్ ఏర్పాటు చేసి పరీక్షలు నిర్వహించాలి
- బీఎస్పీ రాష్ట్ర అధ్యక్షుడు ఆర్.ఎస్.ప్రవీణ్‌కుమార్



నేరెళ్లలో బాధిత దళితులతో మాట్లాడుతున్న ప్రవీణ్‌కుమార్

సిరిసిల్ల: టీఎస్‌పీఎస్సీ సభ్యులంతా సీఎం కేసీఆర్ అనుచరులేనని, పేపర్ల లీకేజీ కేసులో ప్రభుత్వం వారిని కాపాడేందుకు ప్రయత్నిస్తోందని బీఎస్పీ రాష్ట్ర అధ్యక్షుడు ఆర్.ఎస్.ప్రవీణ్‌కుమార్ ఆరోపించారు. శనివారం ఆయన రాజన్న సిరిసిల్ల జిల్లాలో అంబేడ్కర్, కాన్షీరాం విగ్రహాలను ఆవిష్కరించారు. అనంతరం జరిగిన సభల్లో మాట్లాడుతూ, టీఎస్‌పీఎస్సీ చైర్మన్ జనార్దన్‌రెడ్డి, సభ్యులు లింగారెడ్డి, సుమిత్ర, కారెం రవీందర్‌రెడ్డి, సత్యనారాయణ.. అందరూ కేసీఆర్ అనుచరులేనన్నారు. వీరి కాల్‌డాటాను తీయాలని, అలాగే టాప్ 500 ర్యాంకర్ల వివరాలను బయటకు తీయాలని డిమాండ్ చేశారు. సీఎం కేసీఆర్, డీజీపీ, కమిషన్ చైర్మన్‌లు ఎందుకు విలేకరుల సమావేశం పెట్టడం లేదని ప్రశ్నించారు. ప్రస్తుత కమిషన్‌ను రద్దు చేయాలని, కొత్త కమిషన్ ఏర్పాటు చేసి పరీక్షలు పెట్టాలని డిమాండ్ చేశారు. ఇదే అంశంపై ఈనెల 18న అఖిల పక్షాల ఆధ్వర్యంలో ఇందిరాపార్క్ వద్ద మహాధర్నా చేస్తామని ప్రవీణ్‌కుమార్ వెల్లడించారు.

సిరిసిల్లకు ఎన్ని పరిశ్రమలు వచ్చాయి?

ఐటీ మంత్రి కేటీఆర్ సిరిసిల్లకు ఎన్ని పరిశ్రమలు తెచ్చారని, ఎన్ని కంపెనీలు వచ్చాయని ప్రవీణ్‌కుమార్ ప్రశ్నించారు. ఎమ్మెల్సీ కవిత ఏమైనా స్వాతంత్ర్య సమరయోధురాలా? అని ఎద్దేవా చేశారు. ఆమె జైలుకు వెళుతుందన్న భయంతో ఇక్కడ 30 లక్షల మంది నిరుద్యోగ యువతను వదిలి కేటీఆర్ ఢిల్లీకి వెళ్లారని ధ్వజమెత్తారు. అదనపు అడ్వొకేట్ జనరల్ ప్రభుత్వ ఉద్యోగి అన్న విషయం మరచి, కవిత కోసం ఢిల్లీకి ఎలా వెళ్లారన్నారు. సీఎం కేసీఆర్‌కు పంజాబ్, జార్ఖండ్‌లో మాత్రమే రైతులు కనిపిస్తున్నారని, ఇక్కడ నేరెళ్ల దళితులు ఎందుకు కనిపించడం లేదని అన్నారు.

కల్తీ కల్లు కలకలం

- మహబూబ్‌నగర్‌లో ఘటన

సాక్షి ప్రతినిధి, మహబూబ్‌నగర్: ఉమ్మడి పాలమూరులో కల్తీ కల్లు కలకలం సృష్టించింది. మహబూబ్‌నగర్ పట్టణ శివారు కోయనగర్, మోతీనగర్, దొడ్డలోనిపల్లి ప్రాంతాలకి చెందిన కల్తీ కల్లు బాధితులు 10మంది పిచ్చిపిచ్చిగా ప్రవర్తించడంతో వారి బంధువులు శుక్రవారం జిల్లా జనరల్ ఆస్పత్రిలో ఆస్పత్రిలో చేర్పించారు. వీరిలో తొమ్మిది మంది కోలుకోగా వారిని శనివారం ఇంటికి పంపించారు. మిగతా ఒకరికి చికిత్స అందిస్తున్నామని, ఆల్కహాలిక్ విత్‌డ్రాయల్ సిండ్రోమ్‌తో బాధపడుతున్నారని, ఎటువంటి ప్రాణాపాయం లేదని ఆస్పత్రి సూపరింటెంటెండెంట్ రాంకిషన్ తెలిపారు.

మోతాదు తగ్గించడంతోనేనా?: ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లావ్యాప్తంగా కల్లు విక్రయాలు జోరుగా సాగుతుంటాయి. ఈత వనాలు ఉన్నా, లేకున్నా.. మత్తు కోసం కల్లులో నిషేధిత అల్ప్రాజోలం, క్లోరోహైడ్రేట్, డైజోఫాంలను కలపడం ఇక్కడ పరిపాటిగా మారింది. ప్రస్తుతం ఆల్ప్రాజోలంనే ఎక్కువగా వినియోగిస్తున్నారు. తాజాగా అస్వస్థతకు గురైన బాధితులు మహబూబ్‌నగర్ పట్టణ శివారులో కల్తీ కల్లు దందాకు కేరాఫ్‌గా నిలిచిన కాంపౌండ్‌లలో తాగినట్లు తెలిసింది.



తిరుమల శ్రీవారిని శనివారం తెలంగాణ హైకోర్టు న్యాయమూర్తులు జస్టిస్ రాజేశ్వరరావు, జస్టిస్ శ్రీదేవి, తెలంగాణ ఎన్నికల కమిషనర్ పార్థసారథి దర్శించుకున్నారు. శ్రీవారి దర్శనానంతరం ఆలయ రంగనాయకుల మండపంలో పండితులు వీరికి వేద ఆశీర్వచనం అందించారు. –తిరుమల

శ్రీవారి దర్శనం కోసం 40 గంటలు

తిరుమల: తిరుమలలో భక్తుల రద్దీ కొనసాగుతోంది. శనివారం ఔటర్ రింగ్ రోడ్డు, శిలా తోరణం వరకు క్యూలు కిక్కిరిసిపోయాయి. వరుస సెలవులకు వారాంతపు రద్దీ తోడవడంతో మాతృశ్రీ తరి గొండ వెంగమాంబ అన్నప్రసాద భవనం, తిరుమలలోని అన్నప్రసాద కౌంటర్లు, నారాయణగిరి ఉద్యానవనాలలో భక్తుల రద్దీనెలకొంది. శనివారం సాయంత్రం 5 గంటల వరకు దాదాపు 50 వేల మంది యాత్రికులు స్వామివారిని దర్శించుకున్నారు. భక్తుల అధిక రద్దీ కారణంగా రూ.300 ప్రత్యేక ప్రవేశ దర్శనం టోకెన్లు, ఎస్ఎస్‌డీ టోకెన్లు, దివ్య దర్శనం టోకెన్లు కలిగిన భక్తులు మాత్రమే తిరుమలకు రావాలని టీటీడీ విజ్ఞప్తి చేస్తోంది. కాగా, తిరుమల శ్రీవారిని శుక్రవారం 71,782 మంది దర్శించుకున్నారు. హుండీలో రూ.3.28 కోట్లు వేశారు. శ్రీవారి దర్శనానికి 40 గంటల సమయం పడుతోంది.

18న రామప్ప వారసత్వ దినోత్సవాలు

పోస్టర్ ఆవిష్కరించిన మంత్రి శ్రీనివాస్‌గౌడ్



సాక్షి, హైదరాబాద్/హనుమకొండ: ఈ నెల 18న ప్రపంచ వారసత్వ దినోత్సవం సందర్భంగా రామప్ప దేవాలయంలో జరిగే మెగా వేడుకల వాల్ పోస్టర్‌ను రాష్ట్ర ఎక్సైజ్, పర్యాటక, సాంస్కృతిక, పురావస్తు శాఖల మంత్రి వి.శ్రీనివాస్‌గౌడ్ ఆవిష్కరించారు. అనంతరం మంత్రి మాట్లాడుతూ తెలంగాణ సాంస్కృతిక కళావైభవం వేడుకలను రామప్ప దేవాలయంలో పర్యాటకులను ఆకర్షించేవిధంగా నిర్వహిస్తామన్నారు. ఈ వేడుకలకు ప్రముఖ సంగీత దర్శకుడు ఎస్ఎస్ తమన్, ప్రముఖ డ్రమ్స్ వాయిద్యకారుడు శివమణి, సింగర్ కార్తీక్, ఫ్లూటిస్టు నవీన్‌తోపాటు 300 మంది కళాకారులు సంగీతవిభావరి నిర్వహించేలా సన్నాహాలు చేస్తున్నామని చెప్పారు. రాష్ట్రం ఏర్పడిన తర్వాత సీఎం కేసీఆర్ కృషితో 800 ఏళ్ల చారిత్రక కాకతీయ కళాసంపద రామప్ప ఆలయానికి యునెస్కో గుర్తింపు లభించిందన్నారు. తెలంగాణలో రామప్ప దేవాలయంతోపాటు యునెస్కో ప్రపంచ వారసత్వకట్టడాల గుర్తింపునకు అర్హత కలిగిన మరో 10 నుంచి 15 చారిత్రక, వారసత్వ కట్టడాలు, ప్రదేశాలు ఉన్నాయని పేర్కొన్నారు. ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలోని కృష్ణా మండలం ముడుమాలలోని 3 వేల ఏళ్లనాటి ఆదిమానవుల ఆనవాళ్లు, నిలువురాళ్ల సమాధులు, నల్లగొండ జిల్లా పానగల్లు గ్రామంలోని శ్రీ ఛాయసోమేశ్వర దేవాలయాన్ని ప్రపంచ వారసత్వసంపద గుర్తింపు కోసం ప్రతిపాదనలు సమర్పించామన్నారు. తెలంగాణలో ఉన్న సాంస్కృతిక, వారసత్వ ప్రదేశాలు, చిహ్నాల ప్రాముఖ్యత గురించిన అవగాహన, పరిరక్షణకు రాష్ట్ర ప్రభుత్వం అనేక చర్యలు చేపట్టిందని మంత్రి శ్రీనివాస్‌గౌడ్ స్పష్టం చేశారు.

వేడుకలో 'బలగం'చిత్ర ప్రదర్శన

'శిల్పం వర్ణం కృష్ణం'పేరిట రామప్ప దేవాలయంలో జరిగే వారసత్వ దినోత్సవాల పోస్టర్‌ను హనుమకొండ నక్కలగుట్టలోని హరిత కాకతీయ హోటల్‌లో రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు, గిరిజన, మహిళ సంక్షేమ శాఖమంత్రి సత్యవతి రాథోడ్ ఆవిష్కరించారు. వేడుకలకు 'బలగం'చిత్ర యూనిట్‌ను ఆహ్వానించి ఆ సినిమాను కూడా ప్రదర్శించనున్నట్లు ఎర్రబెల్లి తెలిపారు. రామప్ప సరస్సు సమీపంలో ఫుడ్ ఫెస్టివల్, సాయంత్రం పెద్దఎత్తున సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు మంత్రి సత్యవతి తెలిపారు.

జీఎంఆర్, ప్రదీప్‌గౌడ్ వర్గాల బాహాబాహీ

మదనాపురం: దేవరకద్ర కాంగ్రెస్‌లో వర్గ విభేదాలు ఒక్కసారిగా బయటపడ్డాయి. కొంతకాలంగా నివురు గప్పిన నిప్పులా ఉన్న ఈ విభేదాలు శనివారం సాయంత్రం మదనాపురం మండలంలోని దుప్పల్లిలో జరిగిన హాథ్ సే హాథ్ జోడో యాత్రలో బహిర్గతం అయ్యాయి. టీపీసీ ప్రధాన కార్యదర్శి ప్రదీప్‌గౌడ్ గ్రామానికి చేరుకున్న వెంటనే మహబూబ్‌నగర్ డీసీసీ అధ్యక్షుడు జి.మధుసూదన్‌రెడ్డి వర్గీయులు అడ్డుకున్నారు. ఇరువురు నేతలు కలిసి వస్తేనే గ్రామంలో కార్యక్రమం చేయాలని పట్టుబట్టారు. దీంతో ఇరువర్గాల మధ్య బాహాబాహీకి దిగారు. పరిస్థితి అదుపు తప్పడంతో ఒకరిపై ఒకరు దాడులు చేసుకున్నారు.

పెండింగ్ కేసులపై దృష్టి సారించాలి'



మహబూబ్‌నగర్ క్రైం: ప్రతి పోలీస్ స్టేషన్ పరిధిలో పెండింగ్ కేసులు లేకుండా వాటిని పరిష్కరించే దిశగా చర్యలు చేపట్టాలని మహబూబ్‌నగర్ డీఎస్పీ టి.మహేష్ అన్నారు. మహబూబ్‌నగర్ లోని డీఎస్పీ కార్యాలయంలో మహబూబ్‌నగర్ రూరల్, జడ్చర్ల రూరల్, భూత్పూర్ ఎస్‌హెచ్‌ఓ పరిధిలో ఉన్న పోలీస్ స్టేషన్స్ సీఐలు, ఎస్ఐలతో డీఎస్పీ సమీక్ష నిర్వహించారు. జిల్లాలో పదో తరగతి పరీక్ష కేంద్రాల దగ్గర బందోబస్తులో ఏమాత్రం నిర్లక్ష్యం వహించరాదన్నారు. పరీక్ష కేంద్రంలోకి వెళ్తున్న విద్యార్థులతో పాటు సిబ్బందిని సైతం క్షుణ్ణంగా తనిఖీ చేయాలని ఆదేశించారు. రంజాన్ ఉపవాసం సందర్భంగా ఆయా మసీద్‌లు, సున్నితమైన ప్రాంతాల్లో ప్రత్యేక బందోబస్తుతో పాటు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. మహబూబ్‌నగర్, జడ్చర్ల, భూత్పూర్‌లలో కొంత అప్రమత్తంగా ఉండాలని సిబ్బందికి సూచించారు. రూరల్ సీఐ రాజేశ్వర్‌గౌడ్, జడ్చర్ల రూరల్ సీఐ జమ్ములప్ప, భూత్పూర్ సీఐ రజిత రెడ్డి, ఎస్ఐలు పాల్గొన్నారు.

ముగిసిన బావాజీ జాతర



కాళికాదేవి దర్శనంలో కర్ణాటక పశుసంవర్ధశాఖ మంత్రి ప్రభు బి.చౌహాన్

మద్దూరు: కొత్తపల్లి మండలం తిమ్మారెడ్డిపల్లిలో వెలిసినా గురులోకామాసంద్ ప్రభు (బావాజీ) ఉత్సవాలు శనివారం ముగిశాయి. చివరిరోజు శనివారం వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన గిరిజనలు ఉదయాన్నే కాళికాదేవికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆలయం చుట్టూ పల్లకీసేవ, పూర్ణాహుతి హోమం, మహా మంగళహారతి తదితర కార్యక్రమాలు కొనసాగాయి. భక్తులు జీవాలను బలిచ్చి నైవేద్యాలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. భక్తుల ఆటపాటలతో ఆలయ ప్రాంగణం సందడిగా మారింది. జాతరలో భక్తులు గిరిజన ఆభరణాలు, గాజులు, తినుబండారాలు కొనుగోలు చేయడం కనిపించింది.

కర్ణాటక పశుసంవర్ధకశాఖ మంత్రి ప్రత్యేక పూజలు

కర్ణాటక రాష్ట్ర పశుసంవర్ధకశాఖ మంత్రి ప్రభు బి.చౌహాన్ కుటుంబ సమేతంగా ఉత్సవాల్లో పాల్గొని గురులోకామాసంద్ ప్రభు, కాళికాదేవిని దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కులదైవం లోకామాసంద్‌ప్రభును ప్రతి ఏటా దర్శించుకుంటామని తెలిపారు.

ఏర్పాట్లు భేష్..

నాలుగు రోజుల పాటు జరిగిన ఉత్సవాల్లో భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా సకల సౌకర్యాలు కల్పించినందుకుగాను అధికారులు, సిబ్బందిని ఉత్సవాలకు హాజరైన మంత్రులు, ప్రజాప్రతినిధులు అభినందించారు. పర్యవేక్షణ అధికారిగా ఆర్డీఓ రాంచందర్‌నాయక్‌ను నియమించారు. తాగునీటి ఇబ్బందులు తలెత్తకుండా మిషన్ భగీరథ పైప్‌లైన్ వేయించగా.. యుద్ధప్రాతిపదికన 50 మరుగుదొడ్లు, స్నానపు గదులు ఏర్పాటు చేయించారు. మద్దూరు, దామరగిద్ద, కోస్గి, నారాయణపేట నుంచి 179 మంది పారిశుద్ధ్య సిబ్బందిని నియమించగా.. 98 మంది పంచాయతీ కార్యదర్శులు, 9 మంది ఎంపీఓలు, వైద్యసేవల కోసం వైద్యులు, ఏఎన్‌ఎం, ఆశాలు విధులు నిర్వర్తించారు. ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటు చేసుకోకుండా అడిషనల్ ఎస్పీ, డీఎస్పీ, నలుగురు సీఐలు, 10 మంది ఎస్ఐలు, ఏఎస్ఐలు, 30 మంది హెడ్‌కానిస్టేబుళ్లు, 20 హెచ్‌జీలు, 15 మంది ఉమెన్ పోలీసులు బందోబస్తు నిర్వహించగా.. ఎస్పీ వెంకటేశ్వర్లు ప్రత్యేక పర్యవేక్షణ చేశారు.



గాజుల దుకాణంలో గిరిజన మహిళల రద్దీ



ఆభరణాలు కొనుగోలు చేస్తున్న మహిళ

నిఖిత కుటుంబానికి న్యాయం చేయాలి



హాజీపూర్ చౌరస్తాలో రాస్తారోకో చేస్తున్న అఖిలపక్ష నాయకులు

అచ్చంపేట రూరల్: అమ్రాబాద్ మండలం మన్ననూర్ బాలికల గురుకుల పాఠశాలలో ఏడో తరగతి విద్యార్థిని నిఖితది ముమ్మాటికీ హత్యేనని, ఇందుకు ప్రభుత్వమే బాధ్యత వహించాలని ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ ఫోరం రాష్ట్ర అధ్యక్షుడు ధర్మరాజు, డీసీసీ అధ్యక్షుడు వంశీకృష్ణ, మోపతయ్య అన్నారు. శనివారం అచ్చంపేట మండలంలోని హాజీపూర్ చౌరస్తా శ్రీశైలం– హైదరాబాద్ హైవేపై అఖిలపక్షం ఆధ్వర్యంలో రాస్తారోకో నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సిట్టింగ్ జడ్జితో న్యాయ విచారణ చేపట్టాలని, నిఖిత మృతికి కారకులైన వారిని ఉద్యోగం నుంచి తొలగించి కఠిన చర్యలు తీసుకోవాలని, కుటుంబానికి రూ.50 లక్షల ఎక్స్‌గ్రేషియా చెల్లించాలని, కుటుంబంలో ఒకరికి ఉద్యోగం ఇవ్వాలని డిమాండ్ చేశారు. నిఖిత చనిపోయి నెలరోజులు గడుస్తున్నా అధికారులు, ప్రజాప్రతినిధులు పట్టించుకోవడం లేదని ఆరోపించారు. దళిత అమ్మాయి కుటుంబానికి న్యాయం చేయలేని ప్రజాప్రతినిధులు ఉన్నా.. లేకున్నా ఒకటే అన్నారు. బాధిత కుటుంబానికి న్యాయం చేసే వరకు తమ పోరాటం ఆగదన్నారు. స్థానిక ఎమ్మెల్యే గువ్వల బాలరాజు పట్టించుకోవడం లేదని, ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం ముట్టడిస్తామని హెచ్చరించారు. త్వరలో నిర్వహించే అచ్చంపేట దిగ్బంధనం జయప్రదం చేయాలని కోరారు. కాగా పోలీసులు చాకచక్యంగా వ్యవహరించి రహదారిపై వాహనాలు నిలవకుండా జాగ్రత్తలు తీసుకున్నారు. వాహనాలను దారి మళ్లించి వివిధ రూట్లలో పంపించారు. కార్యక్రమంలో నాయకులు కాశీం, శ్రీనివాసులు, వెంకటేష్, నాసరయ్య, అంబయ్య, అఖిలపక్ష పార్టీల నాయకులు పాల్గొన్నారు.

గుడెబల్లూర్‌లో సందెపురాళ్ల పోటీ




సందెపురాళ్ల పోటీ తిలకిస్తున్న గుడెబల్లూర్ గ్రామస్తులు

కృష్ణా: మండలంలోని గుడెబల్లూర్‌లో లక్ష్మీ వెంకటేశ్వర బ్రహ్మోత్సవాల సందర్భంగా శనివారం నిర్వాహకులు సందెపురాళ్ల పోటీలు నిర్వహించారు. స్థానికులతో పాటు కర్ణాటక రాష్ట్రానికి చెందిన వారు పాల్గొన్నారు. విజేతలకు ప్రత్యేక బహుమతులు, నగదు అందించి అభినందించారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ మహదేవమ్మ, ఉత్సవ నిర్వాహకులు, గ్రామపెద్దలు పాల్గొన్నారు.

నిండుకుండలా రామన్‌పాడు జలాశయం

మదనాపురం: మండలంలోని రామన్‌పాడు జలాశయంలో శనివారం నాటికి పూర్తిస్థాయి నీటిమట్టం 1,021 అడుగులకు వచ్చి చేరింది. జూరాల ఎడమ కాల్వ ద్వారా 1,030 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో కొనసాగుతుండగా.. సమాంతర కాల్వ ద్వారా వచ్చే నీటిని నిలిపివేశారు. ఎన్టీఆర్ కాల్వ ద్వారా 950 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు. తాగునీటి అవసరాల కోసం 20 క్యూసెక్కుల నీటిని వినియోగిస్తున్నట్లు ఏఈ రవీల్‌రెడ్డి తెలిపారు.

11న కరోనాపై మాక్‌డ్రిల్



మాట్లాడుతున్న డా. రామకిషన్

పాలమూరు: కరోనా కేసులు పెరుగుతున్న నేపథ్యంలో ఈనెల 11న జిల్లా జనరల్ ఆస్పత్రిలో కోవిడ్ మాక్‌డ్రిల్ ఏర్పాటు చేస్తున్నట్లు జనరల్ ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ రామకిషన్ తెలిపారు. శనివారం ఆయన తన చాంబర్‌లో వైద్యులతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వైరస్ వ్యాప్తి చెంది పాజిటివ్ కేసులు అధికమవుతున్న క్రమంలో ఆస్పత్రిలో కరోనా బాధితులకు చికిత్స అందించడానికి అన్ని రకాల ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. ఇప్పటికే చికిత్స ఇవ్వడానికి ప్రత్యేక ఆక్సిజన్ పడకలతో పాటు ఆక్సిజన్ సరఫరా చేసే ట్యాంకులు అందుబాటులో ఉన్నాయని తెలిపారు. ఆస్పత్రిలో ఆర్టీపీసీఆర్ పరీక్షల సంఖ్య సైతం పెంచడం జరిగిందన్నారు. ప్రస్తుతం జనరల్ ఆస్పత్రిలో కరోనా పాజిటివ్ కేసులు 5–6 ఉంటాయని, లక్షణాలతో వచ్చిన వారికి పరీక్షలు నిర్వహించి అవసరం అయితే అడ్మిట్ చేసుకుంటున్నట్లు తెలిపారు. స్వల్పంగా లక్షణాలు ఉన్న వారు హోం ఐసోలేషన్‌లో ఉంటున్నట్లు పేర్కొన్నారు. సమావేశంలో డాక్టర్ జీవన్ ఇతర వైద్యులు పాల్గొన్నారు.

మునిరంగస్వామి పాహిమాం

- నందిమళ్లలో చింతల మునిరంగస్వామి జాతర ప్రారంభం
- భక్తులతో కిటకిటలాడిన ఆలయ పరిసరాలు

అమరచింత: మండలంలోని నందిమళ్లలో ఉన్న చింతల మునిరంగస్వామి బ్రహ్మోత్సవాలు శనివారం ఘనంగా ప్రారంభమయ్యాయి. వివిధ గ్రామాల నుంచి భక్తులు తరలివచ్చి మొక్కులు చెల్లించుకున్నారు. మూడు రోజులపాటు నిర్వహించడానికి ఆలయ నిర్వాహకులు అన్ని ఏర్పాట్లు చేశారు. శనివారం గణపతి పూజతో ఆలయంలోని మూల విరాట్‌కు జలాభిషేకం, ఆరాధనతోపాటు నైవేద్యాలను సమర్పించారు. రాత్రి ప్రభోత్సం, ఆదివారం రాత్రి రథోత్సవం నిర్వహించనున్నారు. సుదూర ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు అక్కడే వంటలు వండి స్వామివారికి నైవేద్యాన్ని సమర్పించారు. అనంతరం పూజకార్యక్రమాల్లో పాల్గొన్నారు. ఆదివారం పొటేళ్లు, కోళ్లను బలిచ్చి కందూర్‌లను నిర్వహించేందుకు భక్తులు అధిక సంఖ్యలో తరలిరానున్నారు. జాతరలో స్వీట్ దుకాణాలు, హోటళ్లు, ఆట వస్తువుల విక్రయించే షాపులన్నీ కిటకిటలాడాయి. ఎస్ఐ శివనాగేశ్వర నాయుడు బందోబస్తు ఏర్పాటు చేశారు.



మునిరంగ స్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు

ఉత్సాహంగా అథ్లెటిక్స్ క్రీడాకారుల ఎంపికలు



ఎంపికలో లాంగ్‌జంప్ చేస్తున్న క్రీడాకారుడు

మహబూబ్‌నగర్ క్రీడలు: జిల్లాకేంద్రంలోని మెయిన్‌స్టేడియంలో శనివారం జిల్లాస్థాయి అథ్లెటిక్స్ క్రీడాకారుల ఎంపికలు నిర్వహించారు. ఎంపికలను జిల్లా అథ్లెటిక్స్ సంఘం కార్యదర్శి శరత్‌చంద్ర ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వరంగల్‌లోని జేఎన్ స్టేడియంలో ఈనెల 15, 16 తేదీల్లో రాష్ట్రస్థాయి (20 ఏళ్లలోపు బాల, బాలికల) అథ్లెటిక్స్ పోటీలు ఉంటాయని తెలిపారు. జిల్లా క్రీడాకారులు రాష్ట్రస్థాయి పోటీల్లో ప్రతిభచాటి పతకాలు సాధించాలని కోరారు. కార్యక్రమంలో జిల్లా అథ్లెటిక్స్ సంఘం సంయుక్త కార్యదర్శి సి.శ్రీనివాసులు, కోచ్ సునీల్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.